


పాత ఎస్ఎస్ ట్యాంకులో తగ్గిన నీరు

అదనపు ఎస్ఎస్ ట్యాంకులో తగ్గిన నీటి నిల్వ

నీటి గండం..!

● వారానికి ఒకసారి.. అదీ మురుగు నీరు.. ● దెబ్బతిన్న పైప్‌లైన్

ఏళ్లు గడుస్తున్నా గుంతకల్లు ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం కావడంలేదు. రెండు రోజులకు ఒకసారి కూడా మున్సిపాలిటీవారు నీరు ఇవ్వలేకున్నారు. హంద్రీనీవాకు నీరు రాక.. సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు నిండకపోతే నీటి ఎద్దడి ఏర్పడటం సహజం. కానీ మార్చి వరకూ కాలువకు నీరొచ్చినా.. ఉన్న రెండు ఎస్ఎస్ ట్యాంకులు సంపూర్ణంగా నిండినా కూడా పట్టణంలో నీటి సమస్య అలాగే ఉంది. జనావాసాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఐదు రోజులకు ఒకసారి, శివారు ప్రాంతాల్లో వారానికి ఒకసారి నీరు వదులుతున్నారు. రెండు ఎస్ఎస్ ట్యాంకుల్లో వంద రోజులకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని మున్సిపల్ అధికారులు కాగితంపై లెక్కలు చూపుతున్నారు. కానీ వాస్తవ పరిస్థితులు వేరేగా ఉన్నాయి. ఆగస్టు వరకూ నీరు సరిపోతుందని చెబుతున్నా.. జూలై మధ్యలోనే ఎస్ఎస్ ట్యాంకులు ఖాళీ అయ్యే పరిస్థితులు ఉన్నాయి. ఈ సంగతి తెలిసే అధికారులు పక్షం రోజుల నుంచి నీటి సరఫరాలో అంతరాన్ని పెంచేశారు.

- గుంతకల్లు

కలుషిత నీరు వస్తోంది..



రెండు వారాలుగా కొళాయిల్లో కలుషిత నీరు వస్తోంది. ఆ నీటితో వంట చేసుకోవాలంటే భయమేస్తోంది. మినిరల్ వాటర్ కొని వాడుతున్నాము. మున్సిపాలిటీ వారు ఆరు రోజులకు, వారానికి ఒకసారి నీరు వదలుతున్నారు. చాలా ఇబ్బందిపడుతున్నాము.

- ఖాదర్‌బీ, మోమినాబాద్

మంచినీటిని వదలాలి..



పైపులు ఎక్కడ పగిలాయో అధికారులు గుర్తించి, వెంటనే మరమ్మతులు చేయాలి. కొళాయిలకు మంచినీటిని వదలాలి. మురుగు నీటితో ముఖం కడుక్కోవాలన్నా భయం వేస్తోంది. తాగితే రోగాలు వస్తాయోమోనని ఆందోళన చెందుతున్నాం.

-షేకన్‌బీ, గుంతబావి వీధి

ఇవి లెక్కలు..

పట్టణంలోని పాత ఎస్ఎస్ ట్యాంకు సామర్థ్యం 190 కోట్ల లీటర్లు. దీనికి రెండింతల సామర్థ్యంతో అదనపు ట్యాంకు ఏర్పాటు చేశారు. ఈ రెండింటినీ పూర్తి స్థాయిలో నింపి, హంద్రీనీవాకు నీరు వచ్చినన్నాళ్లూ రోజువారీ వినియోగానికి పంప్ చేసుకున్నా పెరిగిన జనాభాకు సరిపోవడం లేదు. పట్టణంలో గృహ అవసరాలకు రోజూ 2 కోట్ల లీటర్ల నీటిని అందించాల్సి ఉంటుంది. రెండు ట్యాంకుల్లో కలిపి 570 కోట్ల లీటర్ల నీటిని నిల్వ చేయొచ్చు. నీరు ఇంకిపోవడం, ఆవిరైపోవడంతో కొంత కోల్పోయినా.. 300 రోజుల పాటు పట్టణవాసులకు నీటిని అందించొచ్చు. కనీసం డిసెంబరు వరకూ మూడు రోజులకు ఒకసారి నీరు వదలవచ్చు. ఇది కాగితాలపై ఉన్న లెక్క. కానీ నీటి వినియోగం ఆ లెక్కల ప్రకారం సాగడం లేదు. ఆగస్టు వరకు నీరు సరిపోయే పరిస్థితులు లేవు.

ఇది వాస్తవం..

పాత ఎస్ఎస్ ట్యాంకులో 102 కోట్ల లీటర్లు, అదనపు ఎస్ఎస్ ట్యాంకులో 279 కోట్ల లీటర్ల నీరు.. మొత్తం 381 కోట్ల లీటర్ల నీరు నిల్వ ఉంది. రోజూ 2 కోట్ల లీటర్ల నీటి వినియోగం జరిగితే.. 190 రోజులకు నీరు సరిపోవాలి. ఇదే జరిగితే పట్టణంలో మూడు రోజులకు ఒకసారి నీటిని వదలవచ్చు. కానీ అలా చేయడం లేదు. ఎస్ఎస్ ట్యాంకుల్లో నీరు వంద రోజులకు మాత్రమే సరిపోతుందని అంటున్నారు. ఎస్ఎస్ ట్యాంకుల సామర్థ్యానికి.. వాస్తవ నీటి నిల్వలకు పొంతన లేదని కొన్నేళ్ల కిందటే ఇంజనీరింగ్ అధికారులు గుర్తించారు. అప్పటి నుంచి ఈ లెక్కలపై ఆధారపడకుండా, ఉన్న నీటిని వారానికోసారి వదలుతూ సర్దుతున్నారు. ఈసారి త్వరగా వర్షాలు వస్తాయని, ఆగస్టుకల్లా హంద్రీనీవాకు నీరు వస్తుందని అంచనా వేస్తున్నారు. వర్షం వస్తే సరి.. లేదంటే పట్టణవాసులు చుక్కనీటి కోసం తల్లడిల్లాల్సి వస్తుంది. పెరిగిన జనాభాకు ఇప్పుడున్న రెండు ఎస్ఎస్ ట్యాంకుల నీరు సరిపోవడం లేదు. మూడో ఎస్ఎస్ ట్యాంకు అవసరమని కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. కానీ ప్రతిపాదనలు ముందుకు వెళ్లలేదు.

కొళాయిల్లో మురుగునీరు..

మున్సిపాలిటీ కొళాయిల్లో మురుగునీరు సరఫరా అవుతోందని పట్టణవాసులు వాపోతున్నారు. శుద్ధిచేసిన నీరు వదలడం లేదని అంటున్నారు. పాత గుంతకల్లు, గుంతబావి వీధి, భాగ్యనగర్, ఎస్ఎన్ పేట తదితర ప్రాంతాల్లో నెల రోజులుగా తాగునీరు మురికిగా ఉంటోంది. ఎస్ఎస్ ట్యాంకుల్లో నీటి నిల్వలు తగ్గిపోయినప్పుడు నీరు మడ్డిగా రావడం పరిపాటి. కానీ ఇంకా వాటిల్లో నీరు అడుగంటలేదు. పట్టణంలో పలు చోట్ల పైపులు పగిలిపోయిన కారణంగా నీరు రంగుమారి సరఫరా అవుతోంది. ఆ నీరు తాగితే ఆస్పత్రి పాలు కావడం తథ్యమని జనం వాపోతున్నారు. పైపులు పగిలిన కారణంగా నీరు కలుషితమౌతోందని, మరమ్మతులు చేస్తే సమస్య పరిష్కారమౌతుందని మున్సిపల్ కమిషనరు వెంకటరమణయ్య అన్నారు. నీటి నిల్వలు ఆగస్టు వరకూ సరిపోతాయని, అప్పటికి హంద్రీనీవా నీరు వస్తుందని, భయపడాల్సిన అవసరం లేదని అన్నారు.

రంగుమారిన నీరు..



ఏడు రోజులకొకసారి నీరు వస్తున్నాయి. పది రోజుల నుంచి కొళాయిలలో రంగు మారిన నీరు వస్తోంది. ఆ నీటిని కాచి వడపోసినా దుర్వాసన పోవటం లేదు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

- తలారి రాములమ్మ, ఫక్కీరప్ప కాలనీ

నీరు తాగలేకపోతున్నాం..



మున్సిపల్ కొళాయిలలో రంగుమారిన నీరు వస్తోంది. పచ్చగా, పాచిపట్టినట్లు ఉంది. వాడుకోవడానికి పనికి రావటంలేదు. ఈ నీరు తాగితే రోగాలు కొనితెచ్చుకున్నట్లే. ఈ నీరు కూడా వారికి ఒకసారి వదులుతున్నారు. మూడు రోజులకు ఒకసారైనా.. మంచి నీటిని సరఫరా చేయాలి.

- సలీమాబి, గుంతబావి వీధి

నేటి నుంచి సప్లీ పరీక్షలు



అనంత పురం విద్య, మే 23: ఇంటర్, పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి మొదలౌతాయి. పదో తరగతి పరీక్షలు వచ్చే నెల 3న, ఇంటర్ పరీక్షలు 1న ముగుస్తాయి. పది పరీక్షలకు 45, ఇంటర్ పరీక్షలకు 34 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పది విద్యార్థులు 13,332 మంది, ఇంటర్ విద్యార్థులు 22,510 మంది.. మొత్తం 35,842 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. పది పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ జరుగుతాయి. ఇంటర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహిస్తారు. అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

చీనీకాయలు టన్ను రూ.38 వేలు

అనంతపురం రూరల్, మే 23: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.38 వేలు, కనిష్ఠంగా రూ.12 వేలు, సరాసరి రూ.24 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 753 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

కౌంటింగ్‌కు పటిష్ట చర్యలు

కలెక్టరు వినోద్ కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఎంకే మీనాకు ఏర్పాట్లను వివరిస్తున్న కలెక్టర్

అనంతపురం టౌన్, మే 23: ఎన్నికల కౌంటింగ్‌కు పటిష్ట చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు వినోద్ కుమార్ తెలియజేశారు. రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ఎంకే మీనా గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. జేఎన్‌టీయూలోని వివిధ విభాగాలలో జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ ఒక పార్లమెంట్ నియోజకవర్గ కౌంటింగ్ ప్రక్రియను నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. స్ట్రాంగ్‌రూమ్స్, కౌంటింగ్ ప్రాంతంలో మూడంచెల భద్రత కొనసాగిస్తున్నామని తెలిపారు. కమిషన్ నిబంధనల మేరకు మీడియా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అన్ని కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్స్ వద్ద సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. కౌంటింగ్‌కు ఏఆర్వోలు, సూపర్‌వైజర్లు, అడిషనల్ ఏఆర్వోలు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లను నియమించామని, తొలి ర్యాండమైజేషన్ పూర్తి చేస్తున్నామని వివరించారు. కౌంటింగ్ ప్రశాంతంగా, సజావుగా సాగడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



నీ కథ చూస్తా.. నరికి పారేస్తా..



ఏదో మత్తులో చేశా.. నన్నొదిలెయ్యండి బాబోయ్..



ఇంక పద స్టేషన్‌కు..



మత్తుగా నడిపింది ఈ కారునే..

ఇంకా మత్తులోనే..!

పబ్లిక్‌లో వైసీపీ వర్గీయుల రచ్చ

పోలింగ్ పూర్తయినా వైసీపీ వర్గీయుల్లో 'మత్తు' ఏమాత్రం తగ్గలేదు. పీకలదాకా మద్యం సేవించి, పబ్లిక్‌లో రచ్చ రచ్చ చేస్తున్నారు. అనంతపురం నగరంలో వైసీపీ కార్యకర్త.. గుండ్లపల్లిలో వైసీపీ సర్పంచ్ కార్లలో తిరుగుతూ ఆకతాయిల్లా వ్యవహరించారు. అనంతపురం రూరల్ మండలం పిల్లిగుండ్ల కాలనీకి చెందిన మల్లికార్జునరెడ్డి, తన మిత్రులతో కలిసి మద్యం సేవించాడు. కారులో రాజురోడ్డు వరకూ ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ వచ్చాడు. ఈ క్రమంలో బైక్‌పై వెళుతున్న విష్ణు బిల్డర్స్ యజమాని తేజ బైక్‌ను ఢీ కొట్టినంత పనిచేశాడు. దీంతో తేజ కారును వెంబడించి.. టీఆర్‌డీఏ కార్యాలయం వద్ద అడ్డుకున్నాడు. కారు తాళాలు లాక్కుని, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో మల్లికార్జున రెడ్డి బెదిరింపులకు దిగాడు. వీధిలో వీరంగం చేశాడు. 'రేయ్.. ఏమనుకున్నావ్.. నేను జగన్ మనిషిని. నరుకుతాం కొడకల్లారా..' అని బీరాలు పలికాడు. అది చూసిన జనం.. 'అబ్బో పెద్ద పాలేగాడు' అనుకున్నారు. కానీ పోలీసులు రాగానే పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు వెంబడించి పట్టుకుని టూటౌన్ స్టేషన్‌కు తరలించారు.

ఇక బెళుగుప్ప మండలం గుండ్లపల్లిలో వైసీపీ మద్దతు సర్పంచ్ పురుషోత్తం మద్యం మత్తులో గ్రామంలో హల్‌చల్ చేశాడు. అర్ధరాత్రి కారులో తిరుగుతూ జనానికి నిద్రలేకుండా చేశాడు. దీంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చినా ఆయన ఏమాత్రం తగ్గలేదు. 'నేను సర్పంచ్. మా ఊళ్లో నేను తిరుగుతా.. అడగడానికి మీరెవరు..?' అని ఎదురు తిరిగాడు. దీంతో పోలీసులను పిలిచిన గ్రామస్థులే సర్దిచెప్పాల్సి వచ్చింది. 'తాగినోడితో ఏంలే..' అని అప్పటికి వదిలేసిన పోలీసులు.. ఆ తరువాత బైండోవర్ చేశారు. రెండు రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సోషల్ మీడియాలో సర్పంచ్‌గారి మత్తు గొడవ వీడియో హల్‌చల్ చేస్తోంది.

- అనంతపురం క్రైం, బెళుగుప్ప



గుండ్లపల్లిలో సర్పంచ్ దెబ్బకు అర్ధరాత్రి మేలుకున్న జనం



గోవాహనంపై దర్శనమిస్తున్న స్వామివారు

గో వాహనంపై నారసింహుడు



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

బ్రహ్మోత్సవాలలో భాగంగా పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి గురువారం గోవాహనంపై విహరించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామి వారిని మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి గోవాహనంపై కొలువుదీర్చారు. ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ ఊరేగించారు. వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సూర వెంకటచలమయ్య శెట్టి కుటుంబ సభ్యులు దాతలుగా వ్యవహరించారు. స్వామివారికి రాత్రి శేషవాహనోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మదిగుబ్బకు చెందిన ఎం. సుదర్శనం, బళ్లారికి చెందిన సూరా లక్ష్మీపతి శెట్టి ఉభయదాతలుగా వ్యవహరించారు. ఈవో విజయ్ కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

- ఉరవకొండ

కౌంటింగ్ రోజు అష్టదిగ్బంధనం

డీఐజీ షిమోషి, ఎస్పీ గౌతమి శాలి



బందోబస్తుపై ఎస్పీతో చర్చిస్తున్న డీఐజీ

తాడిపత్రి టౌన్, మే 23: జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున.. తాడిపత్రి పట్టణంలోకి అనుమానితులు, అల్లరిమూకలు ప్రవేశించకుండా అష్టదిగ్బంధనం చేయాలని అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, ఎస్పీ గౌతమి శాలి ఆదేశించారు. పట్టణ శివారులోని నందలపాడు, ఆటోనగర్, పెద్దపప్పూరు రోడ్డులోని చెక్‌పోస్టులను వారు గురువారం తనిఖీ చేశారు. కౌంటింగ్ రోజున పరిసర మండలాల నుంచి అల్లరిమూకలు తాడిపత్రిలోకి రాకుండా చూసుకోవాలని పోలీసులకు సూచించారు. పట్టణంలో ప్రధాన కూడళ్లు, సమస్యాత్మక కాలనీల్లో పికెట్ కొనసాగించాలని అన్నారు. ముఖ్యనాయకుల ఇళ్లు, వాటి పరిసరాల్లో బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. పట్టణంలో 144 సెక్షన్ అమలులో ఉందని, ఐదుగురి కంటే ఎక్కువ మంది గుమికూడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కౌంటింగ్ రోజు బాణసంచా పేల్చవద్దని, రెచ్చగొట్టే వ్యాఖ్యలకు తావు లేకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వారి వెంట డీఎస్పీలు జనార్దన్ నాయుడు, శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, శివారెడ్డి, సీఐ నాగేంద్రప్రసాద్ ఉన్నారు.

11 మంది అరెస్టు

తాడిపత్రిలో జరిగిన రాళ్లదాడి కేసులో గురువారం 11 మందిని అరెస్టు చేశామని, తొమ్మిది మందిని బైండోవర్ చేశామని ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. తాడిపత్రి పట్టణం, మండలంలోని గంగాదేవిపల్లి, వెంకటాంపల్లి, అయ్యవారిపల్లి గ్రామాల్లో నిందితులను అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు. బైండోవర్ చేసిన వారిని తహసీల్దార్ ఆంజనేయులు ఎదుట హాజరుపరిచి, పూచీకత్తుపై విడిచిపెట్టారు. అరెస్టు అయిన వారిలో లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు. వీరిని అనంతపురం కోర్టుకు తరలించారు.

నిద్రిస్తున్నవారిపై పిచ్చికుక్క దాడి

ఎనిమిది మందికి కాటు



వెంకటరాముడు





గాయపడిన నారమ్మ, సాదిక్, ఇర్ఫాన్, పవన్

గుత్తి, మే 23: పట్టణంలో బుధవారం రాత్రి ఓ పిచ్చికుక్క ఎనిమిది మందిని కరిచింది. స్థానికులు వెంటాడి దాన్ని చంపేశారు. పట్టణంలోని టమెటా మార్కెట్ వీధిలో ఆరుబయట నిద్రిస్తున్న వారిని, వీధి కుక్కలను పిచ్చికుక్క విచక్షణ రహితంగా కరిచింది. ఈ ఘటనతో కాలనీలో కలకలం రేగింది. విషయం తెలుసుకుని పిచ్చి కుక్కను తరిమేందుకు వెళ్లిన వారిపై కూడా దాడి చేసింది. కాలనీకి చెందిన నారమ్మ, వెంకటరాముడు, పవన్, సాదిక్, ఇర్ఫాన్, బాషా తదితరులు కుక్కకాటుకు గురయ్యారు. నిద్రిస్తున్న సమయంలో ముఖంమీద కరవడంతో వెంకటరాముడుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాలనీ వాసులు కర్రలతో వెంటాడి పిచ్చికుక్కను చంపేశారు. పిచ్చికుక్క కాటుకు గురైన వీధి కుక్కలకు వ్యాధి సోకే ప్రమాదం ఉంది. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

మేడమ్.. సర్..!

ఒకే పోస్టు.. ఇద్దరు అధికారులు..

ఎవరి మాట వినాలో తెలియని దుస్థితి

జడ్పీలో మూడు నెలలుగా వింతనాటకం





జడ్పీ కార్యాలయం

అనంతపురం విద్య, మే 23: ఎక్కడైనా ఒక పోస్టులో ఒకే అధికారి ఉంటారు. కానీ జడ్పీలో మాత్రం ఒక పోస్టులో ఇద్దరు అధికారులు పనిచేస్తున్నారు. ఇద్దరూ విధులకు వస్తారు. ఎవరిస్థాయిలో వారు ఆదేశాలు.. సూచనలు ఇస్తారు. కానీ ఎవరివి పాటించాలో తెలియక కిందిస్థాయివారు జుట్టు పీక్కుంటున్నారు. ఏ సమస్యపై ఎవరిని కలవాలో, ఎవరికి ఏ వినతి పత్రం ఇవ్వాలో తెలియక జడ్పీటీసీలు, ఎంపీపీలు బుర్ర గోక్కుంటున్నారు. కొన్ని నెలలుగా జడ్పీలో ఈ తంతు సాగుతోంది. జడ్పీ ఉన్నతాధికారులకు, కలెక్టరేట్ ఉన్నతాధికారులకు తెలిసినా.. చోద్యం చూస్తున్నారు. దీంతో జడ్పీటీసీలు, ఎంపీపీలు, కాంట్రాక్టర్లు, సమస్యలపై జడ్పీ వచ్చే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఎటూతేల్చని అధికారులు...

జడ్పీలో ప్రస్తుతం ఇద్దరు అధికారులు డిప్యూటీ సీఈఓలుగా వ్యవహరిస్తున్నారు. ఒకరు రమణారెడ్డి.. మరొకరు లలితా బాయి. ఈ పరిస్థితికి ఒక రకంగా ఫిబ్రవరి 29న జరిగిన సంఘటన కారణం. ఆ రోజు జరిగిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాలకవర్గ సభ్యులు అందరూ జడ్పీ అధికారుల తప్పిదాలను ఏకరవు పెట్టారు. డిప్యూటీ సీఈఓ లలితా బాయి తమతో అగౌరవంగా మాట్లాడుతున్నారని, సమస్యలపై మాట్లాడేందుకు వెళితే ఏమాత్రం పట్టించుకోవడం లేదని జడ్పీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఈఓ నిదియాదేవి సమక్షంలోనే సభ్యులందరూ కింద కూర్చుని నిరసన తెలిపారు. లలితా బాయిని సరెండర్ చేయాలని, అంత వరకూ స్టాండింగ్ కమిటీ సమావేశాలకు వచ్చేది లేదని సమావేశాలను బాయ్‌కాట్ చేసి వెళ్లిపోయారు. దీంతో మీటింగ్ వాయిదా పడింది. ఈ సమస్యను పరిష్కరించాల్సిన జడ్పీ అధికారులు, జిల్లా స్థాయి ఉన్నధికారులు.. మరింత జఠిలం చేశారు. గతంలో ఉన్న జిల్లా ఉన్నతాధికారి ఇచ్చిన ఉత్తర్వులు సమస్య తీవ్రతను మరింత పెంచాయి.

ఇదీ పరిస్థితి..

పాలకవర్గం వాకౌట్ చేయడంతో.. సమస్యను పరిష్కరిస్తున్నామనే నెపంతో లలితా బాయిని గుంతకల్లు డీఎల్‌డీఓగా నియమించారు. డ్వామాలో జిల్లా విజిలెన్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రమణారెడ్డిని డిప్యూటీ సీఈఓగా నియమించారు. ఇద్దరినీ డెప్యుటేషన్ పద్ధతిలో నియమించారు. అప్పటి కలెక్టర్ గౌతమి ఈ మేరకు మార్చిలో ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ సీఈఓగా రమణారెడ్డి అదే నెల 18న బాధ్యతలు తీసుకున్నారు. అప్పటి నుంచి అసలు సమస్య మొదలైంది. గుంతకల్లు డీఎల్‌డీఓగా వెళ్లాల్సిన లలితా బాయి సైతం జడ్పీ కార్యాలయానికి వస్తున్నారు. కొంతకాలంగా ఆమె నిత్యం జడ్పీకి వచ్చి.. డిప్యూటీ సీఈఓ చాంబర్‌లో ఉంటున్నారు. రమణారెడ్డికి ఇప్పటి వరకూ ఎఫ్ఏసీ ఉత్తర్వులు ఇవ్వలేదు. దీంతో ఆయనకు జీతాలు, బిల్లులు చెల్లింపు అధికారం (డీడీఓ పవర్) దక్కలేదు. ఆ అధికారం లలితాబాయి వద్దే ఉంది. ఈ కారణంగానే ఆమె జడ్పీకి వస్తున్నారని ఉద్యోగుల్లో చర్చ సాగుతోంది. డిప్యూటీ సీఈఓ చాంబర్‌లో రమణారెడ్డి, లలితా బాయి.. ఇద్దరూ డిప్యూటీ సీఈఓలుగానే వ్యవహరిస్తున్నారు. దీంతో జడ్పీలోని ఏఓలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, ఆఖరికి ఎంపీడీఓలు కూడా ఆ ఇద్దరు అధికారుల్లో ఎవరు తమ డిప్యూటీ సీఈఓనో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఎవరి మాట వినాలో.. ఎవరి మాట వినకూడదో అర్థంగాని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఒకరి మాట విని.. మరొకరి మాట వినకుంటే తమకు ఎక్కడ సమస్య వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. మూడు నెలలుగా ఇదే సమస్య కొనసాగుతోంది.

జిల్లాకు భారీ వర్ష సూచన

అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



అనంతపురం టౌన్, మే 23: రానున్న మూడు, నాలుగు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాలపై కలెక్టరేట్‌లో ముందస్తు చర్యలకు సంబంధించి గురువారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురిస్తే ఏయే చర్యలు చేపట్టాలన్న విషయమై క్షేత్రస్థాయిలో ప్రణాళికలు రూపొందించాలన్నారు. తహసీల్దార్, వీఆర్‌ఏ, వీఆర్‌ఓలు ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండేలా చూడాలన్నారు. ఆర్డీవో కార్యాలయాల్లో ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలన్నారు. వరి, మొక్కజొన్న కోత దశలో ఉన్నందున నీరు నిల్వ ఉండకుండా వ్యవసాయ శాఖ అధికారులు రైతులను అప్రమత్తం చేయాలన్నారు. రైతులకు అవసరమైన టార్పాలిన్‌లను అందించాలని సూచించారు. గ్రామ, మండలస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేసి జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినా వెంటనే మరమ్మతులు జరిగేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. నగరంలో ఎమర్జెన్సీ రెస్పాన్స్ వాహనం ఏర్పాటు చేసి డ్రైనేజీల్లో పూడికతీత, పడిపోయిన చెట్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. కల్వర్టులు తెగిపోయే ప్రమాదం ఉందని, మట్టికంకర సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఫైఖోమ్‌నిదియా, నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, డీఆర్‌ఓ రామక్రిష్ణారెడ్డి, పలుశాఖల అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

నేటి నుంచి విత్తన వేరుశనగ పంపిణీ

కె-6 రకం క్వింటం ధర రూ.9500

40 శాతం సబ్సిడీ వర్తింపు

అనంతపురం అర్బన్, మే 23: జిల్లాలోని ఆర్బీకేల్లో శుక్రవారం నుంచి విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభం కానుంది. జిల్లాకు ఈ ఏడాది ఖరీఫ్‌కు 81832 క్వింటాళ్ల వివిధ రకాలు విత్తనాలు కేటాయించారు. ఇందులో వేరుశనగ 76710 క్వింటాళ్లు కేటాయించారు. కంది 2300, మినుములు 46, పెసలు 85, రాగి 4, కొర్ర 50, వరి 1600, జీలుగ 200, పిల్లపెసర 25, ఉలవలు 700, అలసంద 106, జనుము 7 క్వింటాళ్ల చొప్పున కేటాయించారు. ఇప్పటిదాకా జిల్లావ్యాప్తంగా ఆర్బీకేలకు 29208 క్వింటాళ్ల విత్తన వేరుశనగ సరఫరా చేశారు. అయితే అంతర పంటల విత్తనాల సబ్సిడీ ధరలు ఇంకా ఖరారు చేయలేదు. పచ్చిరొట్టే ఎరువులు జీలు, జనుము, పిల్లిపెసరలకు 50 శాతం సబ్సిడీ వర్తింపజేసినప్పటికీ ఇంకా జిల్లాకు స్టాక్ తెప్పించలేదు. సబ్సిడీ ధరలు ఖరారైన తర్వాత అంతర పంటల విత్తనాలు పంపిణీ చేస్తామని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో తొలుత కేవలం విత్తన వేరుశనగ పంపిణీ చేయాలని నిర్ణయించారు.

గరిష్ఠంగా మూడు బస్తాలు పంపిణీ

ఒక్కో రైతుకు గరిష్ఠంగా మూడు బస్తాల వేరుశనగ పంపిణీ చేయనున్నారు. ఒక్కో రైతుకు అర్థ ఎకరా దాకా ఒక బస్తా (30 కేజీలు) విత్తన వేరుశనగ పంపిణీ చేస్తా రు. అర్థ ఎకరా నుంచి ఒక ఎకరా దాకా రెండు బస్తాలు (60 కేజీలు), ఎకరాపైగా భూమి కలిగిన రైతులకు 3 బస్తాలు (90కేజీలు) పంపిణీ చేయనున్నారు.

వేరుశనగ సబ్సిడీ ధరలు...

విత్తన వేరుశనగ సబ్సిడీ ధరలు ఎట్టకేలకు ఖరారుచేశారు. కె-6 రకం వేరుశనగ క్వింటా పూర్తి ధర రూ.9500లుగా నిర్ణయించారు. ఈసారి 40 శాతం సబ్సిడీ వర్తింపజేశారు. ఈ లెక్కన క్వింటాకు సబ్సిడీ మొత్తం రూ.3800పోను రైతు వాటా క్వింటాల్ ధర రూ.5700 చెల్లించాల్సి ఉంటుంది. కదిరిలేపాక్షి రకం వేరుశనగ పూర్తి ధర రూ.8700గా నిర్ణయించారు. ఇందులో 40 శాతం సబ్సిడీ మొత్తం రూ.3480లుపోను రైతు వాటా క్వింటాల్‌కు రూ.5220 చెల్లించాల్సి ఉంటుంది.

వేరుశనగ బస్తాల వారీగా ధరల వివరాలిలా..

వేరుశనగ రకం	మోతాదు	పూర్తి ధర	సబ్సిడీ మొత్తం	రైతు వాటా
కె-6	బస్తా (30 కేజీలు)	రూ.2850	రూ.1140	రూ.1710
కె-6	2 బస్తాలు(60కేజీలు)	రూ.5700	రూ.2280	రూ.3420
కె-6	3 బస్తాలు(90కేజీలు)	రూ.8550	రూ.3420	రూ.5130

వేరుశనగ రకం	మోతాదు	పూర్తి ధర	సబ్సిడీ మొత్తం	రైతు వాటా
కదిరి-లేపాక్షి	బస్తా (30 కేజీలు)	రూ.2610	రూ.1044	రూ.1566
కదిరి-లేపాక్షి	2 బస్తాలు(60కేజీలు)	రూ.5220	రూ.2088	రూ.3132
కదిరి-లేపాక్షి	3 బస్తాలు(90కేజీలు)	రూ.7830	రూ.3132	రూ.4698

సంబరాలకు నో

తిరునాళ్లకు బ్రేక్... బాణసంచాపై నిషేధం

ఎన్నికల నేపథ్యంలో పోలీసుల చర్యలు

అనంతపురం క్రైం, మే 23: తిరునాళ్లు.. జాతర అంటే సంబరం అంతా ఇంతా కాదు. అయితే ఈసారి అంతజోష్ ఉండదు. కేవలం స్వామికి కొబ్బరి కాయ కొట్టి దర్శనం చేసుకొని రావాల్సిందే. ఇక ఎన్నికల గెలుపోటముల అనంతరం టపాసుల శబ్దం రాకూడదు. సంబరాలకు పోలీసులు నో చెప్పేశారు. తాడిపత్రి పట్టణంలో జరిగిన అల్లర్లు, జిల్లాలో అక్కడక్కడ జరిగిన సంఘటనల నేపథ్యంలో పోలీసులను ఈ నిర్ణయం తీసుకున్నారు. పెన్నహోబిళం తిరునాళ్ల మామూలుగానే జరిగిపోతోంది. అయితే వివాదాస్పద ప్రాంతాలు, నియోజకవరాల్లో నిర్వహించే తిరునాళ్లు, జాతర్లకు నో చెప్పేశారు. పెద్దవడుగూరు మండలం రామరాజుపల్లి, కాశేపల్లి, గుత్తి అనంతపురంలలో ప్రతి ఏటా వైశాఖ మాసంలో పున్నమి రోజున బండి శూల తిరునాళ్లు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఉత్సవాలకు పోలీసులు వద్దని చెప్పేశారు. అధికారులు గ్రామ పెద్దలతో చర్చించినా విఫలమయ్యాయి. ఎన్నికల అనంతరం అని చెప్పినా అప్పుడు ఎవరు అధికారంలోకి వస్తారో..? వారితో మరో పార్టీ వారు కయ్యానికి దువ్వడం లాంటి ఘటనలు జరుగుతాయని పోలీసులు నో చెప్పేశారు. కావాలంటే ఆలయంలో సింపుల్‌గా వెళ్లి పూజలు చేసుకోవచ్చుని సలహా ఇచ్చారట.

టపాసుల వాడకంపై నిషేధం: కలెక్టర్

అనంతపురం క్రైం/ టౌన్: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పేలుడు చట్టం 1884లోని సెక్షన్ 6(ఏ) మేరకు జూన్ 6వతేదీ వరకు టపాసుల వాడకంపై నిషేధం విధించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టపాసుల తయారీ, అమ్మకాలు, కొనుగోలు, వినియోగం చేయకూడదని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థుల మద్దతుదారులు విజయోత్సవాలు నిర్వహించే సమయంలో టపాసులు వినియోగించరాదన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఆ ప్రకటనలో హెచ్చరించారు.

అక్రమంగా నిల్వచేసిన టపాసులు సీజ్

పుట్టపర్తి రూరల్: ఎనుమలపల్లిలో అక్రమంగా నిల్వచేసిన టపాసులను సీజ్ చేసి కేసు నమోదుచేసినట్లు అర్బన్ సీఐ కొండారెడ్డి తెలిపారు. తనిఖీల్లో భాగంగా గురువారం ఎనుమలపల్లి శిల్పారామం వెనుకభాగంలోని గోవర్ధన్‌రెడ్డికి చెందిన వ్యవసాయ గోదాములో అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 45వేల విలువచేసే టపాసులను స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు.



టపాసుల గోడౌన్‌ను పరిశీలిస్తున్న సీఐ కొండారెడ్డి

ప్రభుత్వ స్థలంలో ప్రైవేట్ పట్టా!

- రెవెన్యూ అధికారుల మాయాజాలం
- ఆమ్యామ్యాలతో డీసీఎంఎస్ స్థలానికి పట్టాలు
- అధికారపార్టీ ప్రజాప్రతినిధి అండతో ఆగడాలు
- చోద్యం చూస్తున్న డీసీఎంఎస్, సహకార శాఖ అధికారులు
- రూ.కోట్ల విలువైన స్థలంపై కబ్జాదారుల కన్ను



ఆక్రమణకు గురైన డీసీఎంఎస్ స్థలం

అనంతపురం క్లాక్‌టవర్, మే 23: రెవెన్యూ అధికారులకు ఆమ్యామ్యాలు అందితే చాలు క్లాక్‌టవర్‌కు సైతం పట్టా ఇచ్చేసేలా ఉన్నారు. ఇందుకు నిదర్శనమే నగరంలోని డీసీఎంఎస్ స్థలానికి పట్టా ఇవ్వడం. రెండేళ్ల కిందట అధికారపార్టీ ప్రజాప్రతినిధి అండతో అనంతపురం రూరల్ తహసీల్దార్ పట్టా సృష్టించారు. రెండేళ్ల కిందట ఒక్కొక్కరితో రూ.5 లక్షలు తీసుకుని గుత్తి రోడ్డులోని డీసీఎంఎస్ స్థలంలో ముగ్గురికి పట్టాలు ఇచ్చారు. ఈక్రమంలోనే రూ.కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని మరింతగా కొట్టేయాలని ఆక్రమణదారులు కన్నేశారు. ఈక్రమంలోనే ప్రభుత్వ డీసీఎంఎస్ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు శాశ్వత కట్టడాలు నిర్మిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు అందిన కాటికి పుచ్చుకుని మిన్నకుండిపోతున్నారు. ఇప్పటికే సహకార శాఖ అధికారులు విచారణ పేరుతో పలుమార్లు అక్కడికి వెళ్లి, అందినకాడికి పుచ్చుకుని వచ్చినట్లు సమాచారం.

ఆక్రమణలో 38 సెంట్లు

కొందరు అక్రమార్కులు డీసీఎంఎస్‌కు చెందిన 2.28ఎకరాల స్థలాన్ని క్రమ క్రమంగా ఆక్రమించేందుకు పూనుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి గుత్తి రోడ్డుకు వెళ్లేదారిలో రూ.కోట్ల విలువ చేసే స్థలం ఉంది. ఇందులో గోడౌన్లు, హోటళ్లు, ఇతరత్రవాటిని నడుపుకునేందుకు అద్దెకు ఇచ్చారు. అయితే టెండర్లు లేకుండానే ప్రైవేటు వ్యక్తులకు అద్దెకు ఇస్తున్నారు. 2.28 ఎకరాల స్థలంలో ఇప్పటికే దాదాపు 38 సెంట్ల స్థలం ఆక్రమణకు గురైనట్లు సమాచారం. ఇంత బహిరంగంగా నగర నడిబొడ్డున, విలువైన స్థలాన్ని ఆక్రమించుకుంటున్నా డీసీఎంఎస్, సహకార శాఖ అధికారులు ఎందుకు మిన్నకుండిపోతు న్నారో అర్థం కాని పరిస్థితి. స్థలానికి పరిధి నిర్ణయించి కంచె వేయించ కుండా డీసీఎంఎస్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొంద రి ఆక్రమణదారులకు సిబ్బంది సహకరిస్తున్నా రనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొదట లీజు, అద్దె పేరుతో అక్కడికి చేరుకుని క్రమంగా పట్టాలు సృష్టిస్తున్నారు. ఇలాగే ఇప్పటికే ముగ్గురు పట్టాలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

బినామీ పేర్లతో అద్దెకు దుకాణాలు

నిబంధనలకు విరుద్ధంగా బినామీ పేర్లతో దుకాణాలు అద్దెకిచ్చేశారు. నగర నడిబొడ్డున కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఎటువంటి టెండర్లు, అగ్రిమెంట్లు లేకుండానే ప్రైవేటు వ్యక్తులకు అద్దెకిచ్చేస్తున్నారు. అసలు ఎన్నేళ్ల లీజు, ఎంత కాలం అద్దె తెలియకుండానే మేనేజ్ చేసుకుంటూ వస్తున్నారు. వచ్చే అరకొర అద్దెకు లెక్కల్లేకుండా చేస్తున్నారు. దీంతో డీసీఎంఎస్ అధికారులు, సిబ్బందిపైనే అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విలువైన స్థలంలో కనీసం అగ్రిమెంట్లు లేకుండా లీజు, అద్దెకు ఇస్తుండటమే భూ ఆక్రమణలకు కారణమవుతోందని తెలుస్తోంది. బహిరంగంగా ప్రభుత్వ స్థలాలకు రెవెన్యూ అధికారులు పట్టాలు ఇచ్చేస్తున్నా డీసీఎంఎస్ యంత్రాంగం ఎందుకు మిన్నకుండిపోతోందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ స్థలాలకు పట్టాలు ఇచ్చిన రెవెన్యూ అధికారు లపై ఎందుకు కేసు పెట్టలేదనే చర్చ నడుస్తోంది. ఈ తతంగంలో డీసీఎంఎస్, సహకార శాఖ అధికారులు పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



గుత్తిరోడ్డులోని డీసీఎంఎస్ స్థలంలో ప్రైవేటు శాశ్వత నిర్మాణాలు

చోద్యంచూస్తున్న అధికారులు



ప్రభుత్వ స్థలాలను కాపాడాల్సిన సహకారశాఖ, డీసీఎంఎస్ అధికారులు చోద్యం చూస్తున్నారు. డీసీఎంఎస్ స్థలాలను పర్యవేక్షిస్తూ కాపాడాల్సిన సహశాఖ అధికారులు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నార నేది ప్రధాన ఆరోపణ. జిల్లా, డివిజన్, సబ్ డివిజనల్, ఆ కిందిస్థాయి సహకార శాఖ అధికారులు ఆయా స్థాయిలో డీసీఎంఎస్ అధికారుల నుంచి ముడుపులు అందుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులపై పలుమార్లు సహకార శాఖ అధికారులు తూతూమంత్రంగా విచారణ చేసి ఉత్తుత్తి నివేదిక ఇస్తున్నారనే విమర్శలు వినవస్తున్నాయి.

ప్రైవేటు కేసు వేస్తాం



డీసీఎంఎస్ ప్రభుత్వ స్థలంలో పట్టాలు ఇచ్చిన రెవెన్యూ అధికారులపై ప్రైవేటు కేసులు వేయాలని నిర్ణయించాం. డీసీఎంఎస్ పాలకవర్గంలో తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రభుత్వ స్థలంలో పట్టాలు ఇచ్చిన రెవెన్యూ అధికారులు, తీసుకున్న వారిపై చర్యలకు జిల్లా యంత్రాంగానికి నివేదిస్తాం. ఇప్పటికే ఈ విషయం కోర్టులో నడుస్తోంది. ఎంతటివారైనా సరే భూమి ఆక్రమించిన వారిని వదిలిపెట్టేది లేదు.

- విజయభాస్కర్, డీసీఎంఎస్ జిల్లా మేనేజర్

ప్రభుత్వ స్థలాలకు పట్టాలు ఇవ్వకూడదు



ప్రభుత్వ స్థలాల్లో ప్రైవేటు వ్యక్తులకు పట్టాలు ఇవ్వకూడదు. చట్టం ప్రకారం ప్రభుత్వ భూములు ప్రభుత్వ కార్యకలాపాలు, కార్యాలయా లకు మాత్రమే వినియోగించాలి. అడ్డదారుల్లో పట్టాలు సృష్టించి స్వాధీనానికి ఉపక్రమిస్తే చట్టపరంగా శిక్షార్హులే. డీసీఎంఎస్ అనేది ప్రభుత్వరంగ సంస్థ. డీసీఎంఎస్ స్థలాలను ఆక్రమించినవారిపై శాఖాపరంగా విచారణ చేసి, చర్యలు తీసుకుంటాం.

- అరుణకుమారి, జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ)

ఆస్పత్రి తీరు మారదా..?

అందుబాటులో ఉండని సిబ్బంది, స్ట్రెచర్లు, వీల్‌చైర్లు

నడవలేని రోగులకు తప్పని కష్టాలు



- ఈయన పేరు పెద్దన్న. నార్పల మండలం బొందలేడు గ్రామం. కొడుకుకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో నార్పల ఆస్పత్రిలో చూపించాడు. అక్కడ వారు యూరిన్ పైపు పెట్టారు. వారి సలహా మేరకు అనంతపురంలోని పెద్దాస్పత్రికి తీసుకొచ్చాడు. ఆస్పత్రిలో ద్వారం వద్దకు వచ్చినా ఎవరూ పట్టించుకోలేదు. ఇక్కడ స్ట్రెచర్, వీల్‌చైర్‌కోసం తిరిగాడు. దొరకలేదు. ఏమిచేయలేక కొడుకును అలాగే డాక్టర్ల ఉన్న వార్డుకు నడిపించుకుంటూ తీసుకెళ్లాడు.



- ఇక్కడ స్ట్రెచర్‌లో కనిపిస్తున్నది కంబదూరు మండలానికి చెందిన సుబ్రహ్మణ్యం. కాలు విరగడంతో రెండురోజుల కిందట జిల్లా ఆస్పత్రికి వచ్చాడు. సీటీ స్కాన్ కోసం ఆర్థోడాక్టర్ రాసివ్వగా... అతడిని ఎంఎన్‌ఓ స్ట్రెచర్‌లో పడుకోబెట్టుకొని స్కానింగ్ సెంటర్‌కు తీసుకెళ్తున్నాడు. అయితే ఏదో పనిఉందని, కొద్దిసేపు ఉండండని చెప్పి మార్గ మధ్యలో వదిలేసి వెళ్లిపోయాడు. అరగంట అయినా రాలేదు. దీంతో ఆ రోగి బంధువులు ఎంఎన్‌ఓ కోసం స్ట్రెచర్ వద్దే ఎదురుచూస్తూ కనిపించారు.

అనంతపురం టౌన్, మే 23: ప్రతి ఒక్కరికి నాణ్యమైన, ఉచిత వైద్య సేవలు అందేందుకు రూ.కోట్లతో అన్ని వసతులు కల్పిస్తున్నామని ఇటుపాలకులు, అటు అధికారులు గొప్పలు చెబుతున్నారు. అయితే అనంత జిల్లా ఆసుపత్రిలో రోగులకు కష్టాలు తప్పడంలేదు. ఈ ఆస్పత్రి ఉమ్మడి జిల్లాకే పెద్దదిక్కు. ఎలాంటి సీరియస్ కేసులైనా ఈ ఆస్పత్రికి తీసుకొస్తుంటారు. అందుకు తగ్గట్టుగా గతంలో కన్నా ఇపుడు డాక్టర్లు, సిబ్బంది, వసతులు కూడా పెరిగాయి. ఆస్పత్రికి చికిత్సకోసం అది నడవలేనోళ్ల రోగులు పరిస్థితి కడుదయనీయంగా ఉంది. నడబలేని రోగుల సేవల కోసం ఎంఎన్‌ఓలు, ఎఫెన్‌ఓలను ప్రత్యేకంగా నియమించారు. నడవలేవని రోగులను స్ట్రెచర్లు, వీల్‌చైర్స్‌లలో సంబంధిత డాక్టర్ల వద్దకు తీసుకెళ్లడం, అనంతరం వారిని బయటకు తీసుకురావడం వారు చేయవలసిన విధులు. అయితే అనంతపరుంర పెద్దాసు పత్రిలో వీల్‌చైర్‌లు, స్ట్రెచర్లుతో పాటు ఎంఎన్‌ఓలు, ఎఫ్ఎన్‌ఓలు ఎప్పుడూ అందుబాటులో ఉండరు. దీంతో నడవలేని రోగుల బంధువులే ఆస్పత్రి అంతా కలియతిరిగి స్ట్రెచర్ లేదా వీల్ చైర్ తీసుకొచ్చి రోగులను ఆస్పత్రిలోని వార్డుల్లో డాక్టర్ల వద్దకు తీసుకెళ్తున్నారు. అవేవీ దొరకకపోతే కుటుంబ సభ్యులే రోగులను భుజంమీద లేదా వీపున ఎత్తుకొని డాక్టర్లకు చూపించేందుకు తీసుకెళ్తున్నారు. ఆ సమయంలో రోగులు, వారి కుటుంబసభ్యులు ఆసుపత్రి తీరుపై నిట్టూరుస్తున్నారు.



- అనంతపురం నగరం పాతవూరుకు చెందిన వ్యక్తి భీమప్ప. ఆయన కూతురుకు కిందపడి కాలు విరిగింది, ఆటోలో పెద్దాసుపత్రికి తీసుకొచ్చారు. ఇక్కడ అరగంటపాటు ఎంఎన్‌ఓ కోసం, వీల్‌చైర్ కోసం చూశారు, ఎక్కడా కనిపించలేదు. చివరకు ఒక స్ట్రెచర్ దొరికితే ఆయనే దానిని ఆటో వద్దకు తోసుకెళ్లాడు. కాలు విరిగిని తన ఆటోలో నుంచి స్ట్రెచర్ మీదకు చేర్చేందుకు నానా అవస్థలు పడుతూ కనిపించాడు. పక్కన ఉన్న ఓ వ్యక్తి సాయంతో ఆమెను స్ట్రెచర్ పైకి చేర్చాడు.

నోరుమెదపని పర్యవేక్షణాధికారులు?

ఆస్పత్రిలో ఎంఎన్‌ఓలు, ఎఫ్ఎన్‌ఓలు కలిపి 120మంది వరకు ఉన్నారు. వీరందరు షిఫ్ట్‌ల ప్రకారం కేటాయించిన ప్రాంతాలలో విధులు నిర్వర్తిస్తూ రోగులకు సేవలందించాలి. అందు లో భాగంగా కొందరు ఎంఎన్‌ఓలు ఆస్పత్రి ద్వారం వద్ద ఉండాలి. అక్కడవరకు వచ్చిన నడవలేని రోగులను స్ట్రెచర్ లేదా వీల్ చైర్‌లో కూర్చోబెట్టుకొని సంబంధిత వా ర్డులకు తీసికెళ్లాలి. అయితే వీరు ఆస్పత్రిలో ఎక్కడ ఉంటారో తెలియడం లేదు. డ్యూటీలో మాత్రం అందరూ ఉన్నారని అధికారులు చెబుతుంటారు. వారు ఎక్కడ ఉన్నారు? ఏమి పనిచేస్తు న్నారు అనే పర్యవేక్షణ కొరవడింది. పర్యవేక్షణకు ఒక సూపరింటెండెంట్, ముగ్గురు ఆర్ఎంఓలు, మరోఇద్దరు ఎస్ఆర్ఎంలు ఉన్నారు. వీరందరు రోజూ ఆస్పత్రికి రోజు వస్తున్నారు. రోగులు పడే బాధలు చూస్తున్నారు, కానీ ఎంఎన్‌ఓల అలసత్వంపై ఎందుకు మౌనంగా ఉంటున్నారో అర్థంకాని ప్రశ్నగా మారింది. ఏది ఏమైనా ఆస్పత్రిలో పేదరో గులకు కష్టాలు తప్పడం లేదంటూ ఆస్పత్రి నుంచి తిరిగి వెళుతున్నారు.

ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, మే 23: సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్‌పై రూడ్‌సెట్‌లో ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 10వతేదీ నుంచి ప్రారంభించే ఉచిత శిక్షణ 15రోజుల పాటు సాగుతుందన్నారు. ఉమ్మడి జిల్లా గ్రామీణ ప్రాంతాలకు చెందిన 19-45 సంవత్సరాల మధ్య నిరుద్యోగులు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డుతో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్లు 9618876060, 8309915577ను సంప్రదించాలని కోరారు.

ఎన్నికల రెమ్యునరేషన్ ఇవ్వరా..?

నేడు ఉన్నతాధికారులను కలవనున్న సిబ్బంది

అనంతపురం క్రైం, మే 23: ఎన్నికల రెమ్యునరేషన్‌పై ఉద్యోగులు, సిబ్బందిలో ఆందోళన మొదలైంది. ఎప్పుడు ఇస్తారో..? తెలియని పరిస్థితి నెలకొంది. అనంతపురం నియోజకవర్గ పరిధిలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగుల్లో ఈ ఆందోళన ఎక్కువైనట్లు తెలుస్తోంది. ఈ విషయంపై నగరపాలిక సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారట. 2019లో చాలా మందికి రెమ్యునరేషన్ ఇవ్వకపోవడంపై వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం కొందరు వీఆర్‌ఏలు అనంతపురం ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి తమ సమస్య చెప్పుకున్నట్లు తెలిసింది. ఇదే సమస్యపై శుక్రవారం జిల్లా కలెక్టర్‌ను అధిక సంఖ్యలో వెళ్లి కలవనున్నట్లు సమాచారం.

వీఆర్‌కు కానిస్టేబుల్

హిందూపురం, మే 23: లేపాక్షి పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న కానిస్టేబుల్ చెన్నకేశవను వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ అయినట్లు డీఎస్పీ కంజక్షన్ గురువారం తెలిపారు. ఇటీవల పోలీసు ఉన్నతాధికారులు వచ్చినప్పుడు ప్రొటోకాల్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు సదరు కానిస్టేబుల్‌పై ఫిర్యాదులు అందాయని, వీటని దృష్టిలో ఉంచుకుని వీఆర్‌కు పంపినట్లు సమాచారం.

కొనసాగిన పేర్ల రిజిస్ట్రేషన్

అనంతపురం అర్బన్, మే 23

జిల్లాలోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తన వేరుశనగ కోసం రైతుల పేర్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఐదో రోజైన గురువారం కొనసాగింది. ఇప్పటిదాకా 40,704 మంది రైతులు 35,933 క్వింటాళ్ల కోసం పేర్లు నమోదు చేసుకున్నారు.

పట్టు.. తిరోగమనం!

పడిపోయిన గూళ్ల ధరలు... తగ్గిన మల్బరీ సాగు

రాయితీలను ఎత్తివేసిన ప్రభుత్వం

దిక్కుతోచని స్థితిలో రైతులు



మల్బరీ పుల్ల నాటుతున్న రైతులు

అనంతపురం సెంట్రల్, మే 23: జిల్లాలో వ్యయసాయం తరువాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తున్న పట్టుపరిశ్రమ ప్రస్తుతం తిరోగమనం వైపు పయనిస్తోంది. బోరు బావు లు అడుగంటి మల్బరీ సాగుకు సరిపడా నీరు దొరకడంలేదు. దీంతో ఆకు నాణ్యత తగ్గు తోంది. సరైన పోషకాలులేని ఆకును తింటున్న పట్టుపురుగులు నాణ్యమైన గూళ్లను అల్లడంలేదు. వెరసి పట్టుగూళ్లకు మార్కెట్‌లో ధరలు పలకడంలేదు. రూ.700 నుంచి సరాసరి రూ.300కు ధరలు పడిపోయాయని పట్టురైతులు వాపోతున్నారు. పట్టుగూళ్లకు ప్రభుత్వం రాయితీలను చెల్లించడంలేదు. నష్టపరిహారాన్ని ఇవ్వడంలో మీనవేషాలు లెక్కిస్తోంది. ప్రో త్సాహకాలను రద్దు చేసింది. దీనికి తోండు గిట్టుబాటు ధరలు లభించక, పెట్టుబడులు చేతికందక దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు బాధిత పట్టు రైతులు వాపోతున్నారు. దాదాపు ఐదేళ్లుగా పరిస్థితి ఇలాగే ఉండడంతో మల్బరీ సాగు తగ్గుతోందంటున్నారు. తక్కువ పె ట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని అధికారులు మల్బరీ సాగులో దింపుతున్నారని, అయితే పెట్టుబడి కూడా దక్కడం లేదని ఆవేదన చెందుతున్నారు.

ప్రోత్సాహకాల రద్దు...

మల్బరీ సాగుకు గతంలో అడుగడుగునా ప్రభుత్వ పోత్సహకాలు లభించేవి. అధికారులే రైతుల వద్దకు వచ్చి పట్టుసాగుపై అవగాహన కల్పించేవారు. పట్టుగూళ్ల పెంచే షెడ్డు నిర్మాణానికి ప్రభుత్వం 90శాతం వరకు సబ్సిడీ వచ్చేది. అలాగే తక్కువ ధరకే మొక్కలను అందజేసేవారు. సాగుకు అవసరమై ఎరువులు, పంట కూలీ, డ్రిప్పు సామగ్రి, షెడ్డు ఉ ష్ణోగ్రతల నియంత్రణకు అవసరమైన సున్నం, థర్మామీటర్ తదితర వివిధ అనేక ప్రోత్సా హకాలు అందేవి. అయితే వైసీపీ ప్రభుత్వం వాటన్నిటి రద్దుచేసిందని, పట్టుగూళ్లకు ఇవ్వాల్సిన రాయతీలను సైతం ఎత్తివేసిందని రైతులు మండి పడుతున్నారు. ప్రభుత్వ చర్యలతో పట్టుపరిశ్రమ కనుమరగయ్యేదశకు చేరిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

మార్కెట్‌లో ధరలేవీ..?

వ్యయప్రయాసాలకోర్చి కుటుంబం మొత్తం కష్టపడితేనే పట్టు గూళ్లు చేతికొస్తాయి. ఏమాత్రం ఆదమరచినా పురుగు దశలోనే శ్రమ మొత్తం దిబ్బపాలవుతుంది. గూళ్ల అమ్మకంలో ఏ మాత్రం ఆలస్యమైనా గుడ్లను కత్తిరించుకుని పురుగులు బయటకు వస్తాయి. ఇక ఆ గుడ్లను పారవేయాల్సిందే. ఇంతటి శ్రమకోర్చి తీసిన పట్టుగూళ్లకు ప్రభుత్వం సరైన మార్కెట్ ధరలు కల్పించడంలేదని మండిపడుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో గిట్టుబాటు ధరలున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం పెంచడంలేదని వాపోతున్నారు.

ఇరిగేషన్ రాయితీ ఎత్తివేత...

సంవత్సర కాలంగా వర్షాలు లేకపోవడంతో బోరుబావులు అడుగంటుతున్నాయి. అరకొర నీటినైనా సక్రమంగా వినియోగించుకోవాలంటే డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటు చేసుకో వాలి. ఒక ఎకరంలో డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటుకు రూ.లక్షకు పైగా ఖరవుతుంది. ఇందుకు గత ప్రభు త్వం 90శాతం రాయితీ ఇచ్చేదని, దానిని వైసీపీ ప్రభుత్వం ఎత్తివేసిందని మండిపడుతున్నారు. దీంతో నీటి లభ్యతను బట్టి సాగువిస్తీర్ణాన్ని కుదించి రేషం మేపుతున్నామని అంటు న్నారు. ఒక్కోసారి మధ్యలోనే బోరుబావులు ఎండిపోయి పంటను వదిలేసుస్తున్నామని వాపోతున్నారు.

గిట్టుబాటయ్యేలా సూచనలు



రైతులకు గిట్టుబాటు అయ్యేలా మల్బరీ సాగుపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం వేసవిలో నీటి లభ్యతను బట్టి తగిన విస్తీర్ణంలో పంటలు వేయిస్తున్నాం. దీంతో సాగువిస్తీర్ణం తగ్గుతుంది కానీ వర్షాలు ప్రారంభం కాగానే మళ్లీ పెరుగుతుంది. ఎప్పటిక ప్పుడు తోటలను పరిశీలించి నాణ్యమైన మల్బరీ ఆకు వచ్చేలా సూచనలిస్తున్నాం. వేసవి ఉష్ణోగ్రతల వల్ల పట్టుగూళ్ల నాణ్యత తగ్గింది. ఈ క్రమంలో ధరలు తగ్గాయి. రైతులకు అందజేయాల్సిన రాయితీలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తున్నాం.

-అంజనేయులు, పట్టుపరిశ్రమశాఖ జిల్లా అధికారి

ఘనంగా శ్రీవారి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

శింగనమల, మే 23: స్థానిక ఆత్మారామస్వామి గుడిలో భూదేవి, గొలకొండ వెంకటరమణస్వామి కల్యాణాన్ని బుధవారం రాత్రి ఘనంగా నిర్వ హించారు. వైశాఖ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఈ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం



అనంతపురం కల్చరల్, మే 23: వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురష్కరించుకుని గురువారం నగరంలోని పలు ఆలయాల్లో సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. మూడో రోడ్డులోని షిర్డిసాయిబాబా ఆలయంలో సత్యనారాయణస్వామిని విశేషంగా అలంకరించిన వేదపండితులు వ్రతాన్ని నిర్వహించారు. మహామంగళహారతి నివేదనానంతరం భక్తులకు తీర్థప్రసాద, అన్నదాన వినియోగాలు చేశారు. ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

నార్పల, మే 23: నార్పలలో గురువారం రాత్రి 50 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. తాడిమర్రి మండలంలోని ఏకపాదం పల్లెకు చెందిన ఓ వ్యక్తి 50 మద్యం బాటిళ్లను తీసుకెళ్తుండగా తాము అదుపులోకి తీసుకున్నామని, అతనిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

రేపు పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్‌పై అవగాహన సదస్సు

అనంతపురం రూరల్, మే 23: రుద్రంపేట సమీపంలోని పీవీకేకే ఐటీ డిప్లొమో కళాశాలలో శనివారం పాలిసెట్ వెబ్ కౌన్సిలింగ్‌పై ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ వైభవ్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సదస్సు ప్రారంభమవుతుందన్నారు. నిష్ణాతులైన పాలిటెక్నిక్ ప్రొఫెసర్లతో ధ్రువపత్రాల పరిశీలన, వెబ్ కౌన్సెలింగ్‌లోని సమస్యలు, కంప్యూటర్‌లో కళాశాలలోని బ్రాంచ్ ఎన్నుకోవడం తదితరు వాటిపై అవగాహన కల్పిస్తామన్నారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారికి ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఉదయం 9 గంటలకు ఉచిత కాలేజీ బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని, మరిన్ని వివరాలకు 98484 71460, 88822 21124 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠకు ఆర్థికసాయం

అనంతపురం ప్రెస్‌క్లబ్, మే 23: నగరంలోని మున్నానగర్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ముత్యాలమ్మ విగ్రహ ప్రతిష్ఠకు రాయలసీమ బలిజ మహాసంఘం యువజన అధ్యక్షుడు, ఆర్టీసీ మాజీ గౌరవాధ్యక్షుడు తొండపునాటి రమేష్ రూ.15 వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. గురువారం తన నివాసం వద్ద విగ్రహ ఏర్పాటు నిర్వాహకులు వెంకటలక్ష్మి, నరేష్‌కు ఆ నగదు అందజేశారు. కార్యక్రమంలో గురుమూర్తి, వలి, వినోద్, మణికంఠ, రేవంత్, దినేష్, లడ్డు, శశి పాల్గొన్నారు.

కులాన్ని అంటగడితే సహించం

అనంతపురం విద్య, మే 23 : ప్రశాంతంగా విధులు చేసుకుంటున్న తమకు కులాన్ని అంటగడితే సహించబోమని సమగ్రశిక్ష ఏపీఓ నారాయణస్వామి, డీసీఈబీ అసిస్టెంట్ అంజనేయులు గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సమగ్రశిక్ష ప్రాజెక్టు కార్యాలయం వద్ద తాము కులం పేరుతో దూషించుకున్నట్లు, ఉన్నతాధికారులకు తాము ఫిర్యాదులు చేసినట్లు కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ వ్యక్తిగత ప్రతిష్ఠ దెబ్బతినేలా వ్యవహరిస్తున్నారని, ఈ విషయాన్ని డీఈఓ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. తమపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఈఓను కోరామని తెలిపారు. ప్రశాంతంగా విధులు నిర్వహించుకుంటున్న తమను.. వాళ్ల స్వార్థ ప్రయోజనాల కోసం ఇబ్బందులకు గురిచేస్తే... విద్యాశాఖ ఉన్నతాధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

కుంటిమద్దిలో కార్డెన్ సెర్చ్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రామగిరి, మే 23: మండలంలోని కుంటిమద్ది గ్రామంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానిత, రౌడీషీటర్ల ఇళ్లలో, గడ్డివాముల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎవరైనా నిబంధలను అతిక్రమించినా.. అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా, రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

తోటలో విద్యుత్ పరికరాలు చోరీ

గార్లదిన్నె, మే 23: మండలంలోని బూదేడు గ్రామానికి చెందిన జెన్నె రామాంజినేయులుకు చెందిన వ్యవసాయ తోటలో బుధవారం విద్యుత్ పరికరాలు చోరీ అయ్యాయి. తనకున్న ఆరు ఎకరాల్లో రామాంజినేయులు చీనీచెట్లు సాగు చేశాడు. ఇటీవల భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో చీనిచెట్లను కాపాడుకునేందుకు ఇటీవల బోరు వేసుకుని, మోటర్ పైపులైన్ ఏర్పాటు చేశాడు. బుధవారం గుర్తు తెలియని దుండగులు వ్యవసాయ బోరుకు వద్ద సుమారు రూ.15 వేలు విలువచేసే కేబుల్ వైరు, స్టార్ట్‌పెట్టెను ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం రామాంజనేయులు ఈ విషయాన్ని గుర్తించి.. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కిశోర బాలిక మాసిక మహోత్సవం

నార్పల, మే 23: మండలంలోని గొల్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలిక మాసిక మహోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ పీడీ శ్రీదేవి మాట్లాడుతూ ఆరోగ్యం మహాభాగ్యమని, పౌష్టికాహారంతోనే అది సాధ్యమని అన్నారు. చదువు ఆడపిల్లలకు బంగారు భవిష్యత్తుకు పునాది అని, తల్లిదండ్రులు తప్పకుండా ఆడపిల్లలను చదవించాలని సూచించారు. రుతుక్రమం సమయంలో ఆడపిల్లలు తీసుకోవాలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇందులో నార్పల ప్రాజెక్ట్ సీడీపీఓ భారతి, బందలవాడ సెక్టార్ సూపర్‌వైజర్ మధుమాలిని, అంగన్‌వాడీ సిబ్బంది త్రూనీత, దేవక్క, ఆశ వర్కర్ అంజలికుమారి పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

ఆత్మకూరు, మే 23: మండలంలోని పాపంపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు, అలేఖ్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అమ్మ సంస్థ అధినేత శ్రీనివాసులురెడ్డి ఆ గ్రామానికి వెళ్లి.. వారిని పరామర్శించి.. రూ. 10 వేలు ఆర్థిక సాయంతో పాటు సరుకులు అందజేశారు.

ఘనంగా బుద్ధ పూర్ణిమ

అనంతపురం కల్చరల్, మే 23: బుద్ధ పూర్ణిమను పురష్కరించుకొని స్థానిక హౌసింగ్‌బోర్డులోని బుద్ధ విహార్ పార్కులోని గౌతమబుద్ధుని ప్రతిమకు గురువారం పలువురు పూలమాలలు సమర్పించారు. మహాబోధి దాసన్నగారి కృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆ పార్కు కమిటీ ప్రధాన కార్యదర్శి మిద్దె రవీంద్ర మాట్లాడారు. బుద్ధుని మార్గమే ప్రపంచానికి శరణ్యమన్నారు. కార్యక్రమంలో పార్క్ కమిటీ సభ్యులు కేపీ నారాయణస్వామి, మల్లేష, గంగాధర్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ శంకర్, రాఘవేంద్రమ్మ, మారుతమ్మ, తిప్పారెడ్డి పాల్గొన్నారు.



బుద్ధపూర్ణిమ వేడుకల్లో ప్రముఖులు

అదే నిర్లక్ష్యం..!



వరదల సమయంలో జలమయమైన నడిమి వంక



అప్పట్లో నీట మునిగిన రజకనగర్

- 18 నెలలైనా.. గుణపాఠం నేర్వని పాలకులు, అధికారులు
- నడిమివంకలో నేటికీ తొలగని పూడిక
- పలు కాలనీవాసులకు వీడని వరద భయం

అనంతపురం క్రైం, మే 23: నగరంలోని నడిమివంకలో సంవత్సరాలుగా పూడిక తీయలేదు... కొన్ని దశాబ్దాలుగా ఆక్రమణలతో ఆ వంక కుంచించుకుపోయింది. అటు పాలకులు.. ఇటు అధికారులు దాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. వారి నిర్లక్ష్యం పలు కాలనీ వాసులకు శాపమైంది. 2022 సెప్టెంబరులో వరద సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. ఏడెనిమిది కాలనీలను అతలాకుతలం చేసింది. వర్షపు నీరు ఇళ్లల్లో చేరి నిత్యావసర సరుకులు తడిసిముద్దయ్యాయి. అనేక కుటుంబాలు వీధినపడ్డాయి. టీవీ, ఫ్రిడ్జ్ తదితర వస్తువులు చెడిపోయాయి. సోమనాథ్‌నగర్, రంగస్వామి నగర్, రజక్‌నగర్, లెక్చరర్స్ కాలనీ, శ్రీశ్రీ కాలనీలు కొని రోజుల పాటు జలమయ మయ్యాయి. అనేక మంది ఆ ప్రాంతాలను వీడి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోయారు. రోడ్లు, వంతెనలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కొన్ని రోజుల పాటు పాలకులు, అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. ఈ సమస్య మళ్లీ రాకుండా చర్యలు తీసుకుంటామని నాడు హామీ ఇచ్చారు. ఇది గడిచి 18 నెలలైంది. నేటికీ అవే సమస్యలు... నడిమివంకలో నేటికీ పూడికతీత పనులు చేపట్టలేదు. ఆ వంకలో ఆక్రమణలను తొలగించలేదు. దెబ్బతిన్న రోడ్లను.. వంతెనలనూ నేటికీ బాగు చేయలేదు. నేటికీ వర్షం వస్తే ఆ కాలనీవాసుల్లో వణుకే. ఆ రాత్రంతా వారికి కంటి మీద కునుకు ఉండదు. ఏ ఉపద్రవం వచ్చి వరదగా మారి ఇళ్లను ముం చేస్తుందోనన్న భయం. నడిమివంక సమీపం లోని ఇళ్ల నుంచి శివారు ప్రాంతాల కాలనీల ప్రజలకు సైతం వాన వస్తే ఇదే భయం నేటికీ పట్టి పీడిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలు మళ్లీ ఆ ప్రాంతవాసుల్లో ఆందోళన మొదలైంది. వర్షాలు ఎక్కువైతే తమ పరిస్థితి ఏంటని భయపడుతున్నారు. వరదలు వచ్చినప్పుడు నడిమివంక ఎలా ఉందో... ఇప్పుడూ అలాగే ఉంది. రక్షణ గోడలు నిర్మించలేదుకదా.. కనీసం పూడిక కూడా తీయలేదు. వరదల తరువాత ఒక్కసారి కూడా పూడికతీత పనులు చేపట్టక పోవడంతో కాలువ నిండా పిచ్చిమొక్కలు, చెట్లతో నిండిపోయింది. నడిమివంకకు చుట్టూ ప్రహరీని నిర్మించక పోవడమూ చుట్టుపక్కల వారిని భయానికి గురి చేస్తోంది. నీటి ప్రవాహం ఏ కొంత పెరిగినా ఇళ్లల్లో నీరు చేరక తప్పదు. వరదలొచ్చి 18 నెలలు గడిచినా.. ఆరో రోడ్డులో బ్రిడ్జి నిర్మాణానికి నేటికీ శంకుస్థాపన పడలేదు. అది ఇంకా ప్రతిపాదన దశలోనే ఉండటం గమనార్హం. అక్కడ ఎత్తు సరిగా లేకపోవడంతో ఓ మోస్తారు వర్షం కురిసినా ఇళ్లల్లోకి వర్షపు, మురుగు నీరు వచ్చేస్తుంది. నగరానికి సరఫరా అయ్యే తాగునీటి పైపులైన్ ఆ బ్రిడ్జి కింద అడ్డంగా ఉండటంతో సమస్య తీవ్రమవుతోంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ఈ సమస్యపై దృష్టి సారించాలని ఆ కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



అప్పట్లో.. మురుగునీటి బంధనంలో సోమనాథ్‌నగర్



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థినులు, సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న డీసీఓ, ప్రిన్సిపల్

గురుకులాల్లో ఇంటర్ ప్రవేశానికి కౌన్సెలింగ్

అనంతపురంరూరల్, మే 23: ఉమ్మడి జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ డా.బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో బాలికల కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ ప్రవేశానికి కౌన్సిలింగ్ నిర్వహించారు. గురువారం మండలంలోని కురుగుంటలోని డా.బీఆర్.అంబేద్కర్ కళాశాలలో ఈ ప్రక్రియను చేపట్టారు. ఉమ్మడి జిల్లాలోని 13 బాలికల కళాశాలల్లో 295 ఖాళీలకు 1:3 నిష్పత్తిలో కౌన్సెలింగ్ చేపట్టారు. విద్యార్థుల సర్టిఫికెట్లను డీసీఓ మురళీ కృష్ణ పరిశీలించి.. కౌన్సెలింగ్ ప్రక్రియను చేపట్టారు. మార్కుల ఆధారంగా విద్యార్థినుల ఎంపిక జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కురుగుంట కళాశాల ప్రిన్సిపాల్ సునీత, ఇతర కళాశాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం కల్చరల్, మే 23: నగరంలోని డి-3 పరిధిలో గత కొన్ని వారాలుగా ప్రజలు విద్యుత్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, వాటిని వెంటనే పరిష్కరించాలని సీపీఎం నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఏఈ రమేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రామిరెడ్డి మాట్లాడుతూ... డి-3 పరిధిలోని కాలనీల్లో కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో కూడా తెలియడం లేదన్నారు. కరెంటు పోయినప్పుడు ఏఈ కార్యాలయానికి, అధికారులకు ఎన్నిమార్లు ఫోన్ చేసినా స్పందన లేదన్నారు. మూడు రోజుల క్రితం నగరంలో కురిసిన చిన్నపాటి వర్షం, గాలి కారణంగా చెట్లు కూలిపోవడంతో విద్యుత్ సమస్యలు అధికమ య్యాయన్నారు. మూడు రోజులైనా విద్యుత్‌శాఖ అధికారులు ఆ సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని విమర్శించారు. దీనికి ఏఈ స్పందిస్తూ ... సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు వలి, మసూద్, ప్రసాద్, ఎన్టీఆర్ సీన, రాజు, గఫూర్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

గాయపడిన టీడీపీ ఏజెంట్‌కు పరామర్శ

నార్పల, మే 23: నార్పల మండలం రంగాపురం గ్రామానికి చెందిన టీడీపీ ఏజెంట్ మనోజ్‌కు ఇటీవల జరిగిన బైక్ ప్రమాదంలో కాలు విరగింది. బెంగళూరులోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతన్ని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు గురువారం పరామర్శించారు.

వడ్డే వీధి దారి కబ్జా

- అడ్డంగా ప్రహరీ నిర్మాణం
- వైసీపీ నాయకుల అండతో దుశ్చర్య
- ఆటోలు కూడా వెళ్లలేని దుస్థితి

అనంతపురం కల్చరల్, మే 23: స్థానిక ఆజాద్‌నగర్‌లోని వడ్డే వీధికి వెళ్లే దారి కబ్జాకు గురైంది. మొదట ఈ దారి 12 అడుగులు ఉండేది. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఒక ప్లాట్ వారు స్థానిక వైసీపీ నాయకుల అండతో సుమారు 8 అడుగులను కబ్జా చేసి.. ప్రహరిని నిర్మించుకున్నారు. గతంలో ఆ దారిలో లారీలు సైతం వెళ్తుండేవి. కాని ప్రస్తుతం ఆటోలు కూడా వెళ్లలేని దుస్థితి ఏర్పడింది. ఈ మార్గంలో ఒక బైక్ ఎదురుగా వస్తే మరో బైక్ ఆగి వెళ్లాల్సి వస్తోంది. కాలనీలోకి కనీసం కూరగాయల తోపుడు బండ్లు సైతం రాలేని స్థితి ఏర్పడిందని ఆ కాలనీవాసులు వాపోతున్నారు. ఇక ఎవరికైనా అనారోగ్యానికి గురైతే.. అంబులెన్స్ కూడా రాలేని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు స్పందించి.. కబ్జాను తొలగించాలని కోరుతున్నారు.



▲ వడ్డే వీధి లోపల వెడల్పుగా ఉన్న రోడ్డు

▼ కబ్జాకు గురైన ప్రధాన రహదారి నుంచి వడ్డే వీధిలోకి వెళ్లే రస్తా



'వరద హస్తం' పుస్తకావిష్కరణ



వరదహస్తం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

అనంతపురం కల్చరల్, మే 23: అనంతపురానికి చెందిన రచయిత్రి గండ్లూరి పంకజమ్మ రాసిన కథల సంపుటి 'వరద హస్తం' పుస్తకావిష్కరణ సభను స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో గురువారం నిర్వహించారు. స్పందన అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి వి.చంద్రశేఖరశాస్త్రి అధ్యక్షతన ఈ సభను నిర్వహించారు. సీనియర్ రచయిత్రి నిర్మలారాణి, డాక్టర్ కోడూరి విష్ణునందన్, రాజారామ్ ముఖ్యఅతిథులుగా హాజరై ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ... వరదహస్తం కథల సంపుటిలోని కథలన్నీ మంచిని పెంచుతాయని, దైనందిన మధ్యతరగతి జీవితంలో మనుషుల తీరుతెన్నులు, సమాజ పోకడలను యదాతథంగా ఈ పుస్తకంలో పొందుబరిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహితీకారులు యమునారాణి, పేరిందేవి, తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవాసంస్థ అధ్యక్షుడు టీవీ రెడ్డి, డాక్టర్ పి.శ్రీదేవి, గంగిరెడ్డి అశ్వర్థరెడ్డి, నాసీల నాగేంద్ర, తరిమెల అమరనాథరెడ్డి, అప్పిరెడ్డి హరినాథరెడ్డి, షేక్ రియాజుద్దీన్, జూటూరు షరీఫ్, జెట్టి జయరాం, గోవిందరాజులు పాల్గొన్నారు.


ప్రైవేట్ స్కూల్ బుక్స్, యూనిఫాం గది సీజ్



పుస్తకాలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ

అనంతపురం విద్య, మే 23: నగర శివారులోని ప్రతిభ స్కూల్ పుస్తకాలు, యూనిఫాం గదిని అధికారులు సీజ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే... అక్రమంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తున్నారని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు నాయకులు గురువారం అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య మాట్లాడుతూ.. జిల్లాలో ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు ఇబ్బడిముబ్బడిగా స్కూళ్లలో అడ్మిషన్లు చేస్తున్నాయన్నారు. ఇప్పటికే చాలా స్కూళ్ల సీట్లు లేవంటూ తల్లిదండ్రులకు తెగేసి చెబుతున్నారని తెలిపారు. అంతేకాకుండా యూనిఫాం, పాఠ్యపుస్తకాలు ముద్రించి యథేచ్ఛగా అమ్ముతున్నారన్నారు. స్కూళ్లను బట్టలషాపులుగా మారుస్తున్నారంటూ మండిపడ్డారు. అలాంటి స్కూళ్లపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిభ స్కూల్‌లో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం విక్రయాలపై డిప్యూటీ డీఈఓకు ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడికి చేరుకున్న అయన పాఠశాలను పరిశీలించి స్కూల్‌లో బుక్స్, యూనిఫాం విక్రయిస్తున్న గదిని సీజ్ చేశారు. కార్యక్రమంలో ఆ నాయకులు మంజు, భీమేష్, వంశీ, సిద్దు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



చంద్రమోహన్ (ఫైల్)

ఆత్మకూరు, మే 23: మండలంలోని పంపనూరు పార్కు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తలుపూరు గ్రామానికి చెందిన చంద్రమోహన్ (25) దుర్మరణం చెందాడు. అతను బైక్‌పై ఆత్మకూరు వెళ్లి.. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా... గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. చంద్రమోహన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని పోలీసులు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చంద్రమోహన్ మృతదేహానికి టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ, నాయకులు నివాళులర్పించారు.



హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

గుత్తిరూరల్, మే 23: మండలంలోని కొత్తపేట గ్రామశివారులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వరస్వామి కల్యాణం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే స్వామి వారికి పంచా మృతాభిషేకం, వివిధ పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమాలు నిర్వహించి, 10 గంటలకు కల్యాణం నిర్వహించారు. స్వామి వారిని పల్లకిలో ఉంచి దేవాలయం చుట్టు ఊరేగించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నాగేపల్లి లక్ష్మయ్య అర్చకులు పాల్గొన్నారు.

ఘనంగా మొలకల పౌర్ణమి

పుట్లూరు, మే23: మండలంలోని బాలాపురం గ్రామంలో గురువారం గ్రామస్థులు మొలకల పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మొలకలను మట్టికుండల్లో ఉంచి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మట్టికుండలను తలపై ఎత్తుకొని ఊరేగింపు చేశారు. గ్రామంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇలా చేయడం వల్ల సకాలంలో వర్షాలు పడి పంటలు సమృద్ధిగా పండుతాయని గ్రామస్థుల విశ్వాసం.

యల్లనూరు : మండలంలో గురువారం మొలకల పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెన్నపూసపల్లి, పాతపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాల్లో ఈ వేడుకలు జరిగాయి. వేడుకల్లో భాగంగా వారంరోజుల కిందట మట్టి కుండల్లో నవధాన్యాలను ఉంచారు. గురువారం ఉదయం వాటిని బయటకు తీసి వాటిలో నుంచి వచ్చిన మొలకలను మహిళలు తలపై ఉంచుకొని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండి గ్రామాలు కళకళలాడాలని వేడుకున్నారు.





వెన్నపూసపల్లిలో మొలకలు తీసుకెళ్తున్న మహిళలు, మొలకలతో చిన్నారులు, మహిళలు (పుట్లూరు)

కూలీల హాజరు శాతం పెరగాలి



మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ మైఖోమ్ నిదియాదేవి

కూడేరు, మే 23: ఉపాధి పనులకు కూలీలు వచ్చేలా చూడాలని జడ్పీ సీఈఓ మైఖోమ్ నిదియాదేవి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఉపాధి పనులపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల్లో ఏఏ పనులు చేస్తున్నారని సంబంధిత అధికారులను ప్రశ్నించారు. తక్షణం అన్ని గ్రామ పంచాయతీల్లో పనులు వేగవంతం చేయాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవన్నారు. వివిధ అంశాలపై ఏపీఓ తులసి ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పర్యటించి పనులకు కూలీలు హాజరయ్యే విధంగా అవగాహన కల్పించాలని ఎంపీడీఓను ఆదేశించారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి

బెళుగుప్ప, మే 23: గొర్రెలు, మేకలకు సోకే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కాపరులకు స్థానిక పశు వైద్యాధికారి రమేష్ బాబు సూచించారు. గురువారం మండలంలోని యలగలవంక తండాలో కాపరులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ తొలకరి వర్షాలకు మొలకెత్తిన పచ్చ గడ్డి విషపూరితంగా ఉంటుందని, దానిని తినడం వల్ల చిటుక వ్యాధి సోకి గొర్రెలు, మేకలు చనిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. కాపరులు అప్రమత్తంగా ఉండి వెంటనే పశువైద్యుల దృష్టికి తీసుకువస్తే వ్యాధి ప్రబలకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేటి నుంచి కళాశాలకు అటానమస్

గుంతకల్లుటౌన్, మే 23: పట్టణంలోని శ్రీశంకరా నందగిరి స్వామి డిగ్రీ కళాశాలకు శుక్రవారం నుంచి అటానమస్ గుర్తింపు వర్తింపజేస్తున్నట్లు యూజీసీ ఉత్తర్వులు ఇచ్చిందని కళాశాల కరస్పాండెంట్ కేసీ హరికుమార్, ప్రిన్సిపాల్ గోపాల్ పేర్కొన్నారు. స్థానిక కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఐదేళ్ల పాటు అటానమస్ గుర్తింపు ఉంటుందని తెలిపారు. యూజీసీ తమ కళాశాలకు స్వయం ప్రతిపత్తి ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఈ సమావేశంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

లక్ష కుంకుమార్చన



అలంకరణలో వాసవీమాత

గుంతకల్లు టౌన్, మే 23: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత జయంతి ఉత్సవాలలో భాగంగా గురువారం లక్ష కుంకుమార్చన నిర్వహిం చారు. అమ్మవారి మూలవిరాట్టును బంగారు చీరతో అలంకరించి, పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ గాయత్రి హోమం, పూర్ణాహుతి, మహామంగళహారతి ఇచ్చారు. సాయంత్రం వాసవీ ఉత్సవ మూర్తిని అలంకరించి రథంలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య అమ్మవారి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆర్యవైశ్యసంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అన్నమాచార్యుల జయంతి

తాడిపత్రిటౌన్, మే23: పట్టణంలోని గాంధీకట్ట వద్ద ఉన్న స్నేహభారతి సంగీత శిక్షణాలయంలో గురువారం అన్నమాచార్యుల జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో మహేష్, శివప్రసాద్, నాగరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం

బ్రహ్మసముద్రం, మే 23: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ చేసింది. బృందం సభ్యులు గోవిందగౌడ్ ఆధ్వర్యంలో రికార్డులను తనిఖీ చేశారు. మండలంలోని సచివాలయంలో ఏఎన్‌ఎంలు నిర్వహిస్తున్న రికార్డులను కూడా వారు తనిఖీ చేశారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సభ్యులైన జరీనా బేగమ్, డీపీహెచ్‌ఎస్ హేమలతలు పరిశీలించారు. గ్రామాల్లో ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం సంతృప్తి వ్యక్తం చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ తెలిపారు.

ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం: కాలవ

బొమ్మనహాళ్, మే 23: రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, అరకొర సబ్సిడీ ఇచ్చి చేతులు దులుపుకుందని రాయదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని దేవగిరిక్రాస్‌లో గురువారం టీడీపీ నాయకుడు మల్లీడు శ్రీనివాసులు స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాలవ మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన ఇన్‌పుట్ సబ్సిడీలో తీవ్రమైన అన్యాయం జరిగిందన్నారు. జిల్లాలో రూ.1500 కోట్లు నష్టం జరిగినట్లు అంచనా వేసిన ప్రభుత్వం అంత సొమ్ము రైతుల ఖాతాల్లో జమ చేయడంలో మాత్రం విఫలమైందన్నారు. ఈ సీజన్‌లో ఇన్‌పుట్ సబ్సిడీ రైతులందరికీ అందేలా చూడాలన్నారు. నష్టపోయిన మిరపరైతులకు పరిహారం అందించాలన్నారు. ప్రస్తుతం విత్తన పంపిణీలో సబ్సిడీని పెంచాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన విత్తనాలను అందించాలని కోరారు. రైతుభరోసా కేంద్రాలలో మిరప విత్తనాలను కూడా సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ నాయకులు కొండాపురం కేశవరెడ్డి, బలరాంరెడ్డి, కొత్తపల్లి మల్లికార్జున, కుమ్మరి మల్లికార్జున, యర్రగుంట్ల వెంకటేశులు, ముల్లంగి నారాయణస్వామి, కొత్తపల్లి తిమ్మరాజు, సల్లాపురం బాబు, మాలపాటి ధనుంజయ, పయ్యావుల అనిల్, పయ్యావుల మోహన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

టీడీపీ నాయకుడి మృతికి నివాళి

మండలంలోని దేవగిరి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు శ్రీరాములు(50) గురువారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న కాలవ శ్రీనివాసులు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు. తెలుగుదేపార్టీ అండగా ఉంటుందని అధైర్యపడొద్దని వారికి భరోసా ఇచ్చారు.

ఎలుగుబంటి దాడిలో ఒకరికి గాయాలు



గాయపడిన గొల్ల హనుమంతరాయుడు

కళ్యాణదుర్గంరూరల్, మే 23: శెట్టూరు మండలం కంబాల పల్లిలో గురువారం హనుమంతరాయుడు అనే వ్యక్తిపై ఎలుగుబంటి దాడి చేసింది. బాధితుడు తెలిపిన మేరకు.. ఉదయం 6 గంటలకు చింత చిగురు తేవడానికి గ్రామ సమీప ప్రాంతానికి వెళ్లాడు. చింత చిగురు కోసుకుని ఇంటికి వస్తున్న సమయంలో చెట్ల పొదల్లో ఉన్న ఎలుగుబంటి ఒక్కసారి దాడి చేసింది. దాన్నుంచి తప్పించుకోవడానికి చెట్టుని ఎక్కబోయాడు. అయినప్పటికీ చెట్టుపై నుండి లాక్కుని మరీ దాడి చేసింది. దీంతో అతను గట్టిగా అరవడంతో కుక్కలు ఎలుగుబంటిని వెంబడించడంతో అటవీ ప్రాంతంలోకి పరుగులు తీసింది. గ్రామస్థులు బాధితుడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

టౌన్ బ్యాంక్ మాజీ మేనేజర్ ఆత్మహత్య



శ్రీనివాసరావు (ఫైల్)

తాడిపత్రిటౌన్, మే23: పట్టణంలోని పుట్లూరురోడ్డు రైల్వేట్రాక్ సమీపంలో ఇండ్లకొండయ్యవీధికి చెందిన దద్దం శ్రీనివాసరావు (62) గురువారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు శ్రీనివాసరావు తాడిపత్రి కో ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్‌లో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూ 2020లో వీఆర్‌ఎస్ తీసుకొన్నారు. అప్పటి నుంచి ఇంటివద్దనే ఉండేవాడు. అనారోగ్యంతో జీవితంపై విరక్తిచెంది గురువారం తెల్లవారుజామున రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతడికి భార్య విజయలక్ష్మీ, కుమార్తె నాగదీపిక ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా బుద్ధ జయంతి

తాడిపత్రిటౌన్, మే23: స్థానిక టీచర్స్‌కాలనీ పెన్షనర్ల భవనంలో గురువారం బుద్ధ జయంతి వేడుకలను నిర్వహించినట్లు అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుద్ధుడి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బుద్ధుడు చూపిన సన్మార్గంలో నడవాలన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే దుకాణాలు సీజ్

యాడికి, మే23: నకిలీ పత్తి విత్తనాలు విక్రయించి రైతులను మోసం చేస్తే సంబంధిత ఫర్టిలైజర్స్ దుకాణాలను సీజ్ చేస్తామని ఏఓ మహబూబ్‌బాషా తెలిపారు. మండలకేంద్రంలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాల్లో గురువారం ఆయన తనిఖీలు నిర్వహించారు. పత్తి విత్తనాల విక్రయాలపై ఆరాతీశారు. పత్తి విత్తనాల ప్యాకెట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో రైతులు ఎక్కువగా పత్తి సాగుకు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఫర్టిలైజర్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫర్టిలైజర్స్ దుకాణాల్లో విక్రయాలకు సంబంధించి రైతులకు బిల్లులు ఇవ్వాలని తెలిపారు. వ్యవసాయశాఖ నిర్దేశించిన మందులు, ఎరువులను మాత్రమే విక్రయించాలని ఆయన తెలిపారు.

బాధితురాలికి అభయ చేయూత



ఆర్థిక సాయం చేస్తున్న సంస్థ సభ్యులు

పామిడి మే 23: మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్న పామిడి పట్టణానికి చెందిన షేక్షావలి భార్య షనాజ్‌కు అభయ ఆపద్బాంధవ సంస్థ సభ్యులు చేయూతనిచ్చారు. షేక్షావలి అనారోగ్యంతో బాధపడుతున్న తన భార్య షనాజ్‌కు బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందించాడు. ఆపరేషన్ చేస్తేనే మెదడు సంబంధిత వ్యాధి నయం అవుతుందని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. ఆర్థిక స్తోమత లేకపోవడంతో తిరిగి ఇంటికి వచ్చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న అభయ ఆపద్బాంధవ సంస్థ సభ్యులు, వడ్డే రాముడు మిత్ర బృందం, మరికొందరు దాతలు గురువారం బాధితురాలి ఆపరేషన్ కోసం రూ.75వేల ఆర్థిక సాయం అందించారు.

సమతుల ఆహారాన్ని తీసుకోవాలి

గుత్తి, మే 23: బాలికలు క్రమం తప్పకుండా సమతుల ఆహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి పేర్కొన్నారు. పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రాల ను గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం బాలికలకు రుతుక్రమ ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు నెలసరి సమయంలో ఐరన్, ప్రొటీన్ సమృద్ధిగా ఉండే సమతుల ఆహారాన్ని, విటమిన్ సీ కలిగిన ఆహారాన్ని, ప్రొటీన్లు ఎక్కువగా ఉండే శాఖాహారం, మాంసాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు, పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

గుంతకల్లుటౌన్, మే 23: పట్టణంలోని హంపయ్య కాలనీలో నివాసముంటున్న షేక్ అబీనా బేగం, షేక్ మహబుబ్‌బాషా ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. మహబుబ్‌బాషా, అబీనాబేగం దంపతులు బుధవారం రాత్రి ఇంటికి తాళం వేసి మస్తానయ్య దర్గాలో నిద్ర చేయడానికి వెళ్లారు. దుండగులు రాత్రి తాళాలు పగలగొట్టి ఇంట్లో చోరబడ్డారు. బీరువాను పగలగొట్టి అందులో ఉన్న రెండున్నర తులాల బంగారు నగలు, 500గ్రాముల వెండీ ఆభరణాలను ఎత్తుకెళ్లారు. ఈ విషయంపై బాధితులు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామసుబ్బయ్య తెలిపారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

యాడికి, మే23: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను యాడికి సీఐ నాగార్జునరెడ్డి హెచ్చరించారు. గురువారం పలువురు రౌడీషీటర్లకు ఆయన కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. ఎవరైనా గొడవల జోలికి వెళితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



రౌడీషీటర్లను హెచ్చరిస్తున్న సీఐ (యాడికి)

పెద్దవడుగూరు: ఘర్షణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, కవ్వింపు చర్యలకు దిగడం వంటివి చేయరాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే కేసులే..

యాడికి: సోషల్‌మీడియాలో రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే కేసులు నమోదు చేస్తామని సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు 144సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియాలో రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టినా, గొడవలు ప్రేరేపించే విధంగా కవ్వింపులకు దిగినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సంబరాలు చేయొద్దు

పామిడి: ఎన్నికల ఫలితా తర్వాత ఎలాంటి సంబరాలు చేయొద్దని తెలుగు తమ్ముళ్లకు పోలీసులు హెచ్చరించారు. గురువారం సాయంత్రం టీడీపీ నాయకులు బొమ్మ మోహన్ కృష్ణ, శ్రీరాములు, సుంకప్ప, వెంకటరమణ, రవి, రామాంజినేయులు, విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్‌లను పోలీసు స్టేషన్‌కు పిలిపించి నోటీసులు జారీ చేశారు.

ఓబులాపురంలో నాకాబందీ

పుట్లూరు: మండలంలోని ఓబులాపురం గ్రామంలో గురువారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరువర్గాలకు చెందిన ఇల్లు, గడ్డివాముల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం ఇరువర్గాలతో సీఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ రోజు ప్రశాంత వాతావరణం ఉండాలన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



హోమాలు నిర్వహిస్తున్న అర్చకులు

గుత్తిరూరల్, మే 23: మండలంలోని కొత్తపేట గ్రామశివారులోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వరస్వామి కల్యాణం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామునే స్వామి వారికి పంచామృతాభిషేకం, వివిధ పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమాలు నిర్వహించి, 10 గంటలకు కల్యాణం నిర్వహించారు. స్వామి వారిని పల్లకిలో ఉంచి దేవాలయం చుట్టు ఊరేగించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు నాగేపల్లి లక్ష్మయ్య అర్చకులు పాల్గొన్నారు.

మెచ్చిరి గ్రామంలో పోలీసుల కార్డెన్ సెర్చ్



గ్రామంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

రాయదుర్గంరూరల్, మే 23: మండలంలోని మెచ్చిరి గ్రామంలో గురువారం సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాత కేసుల్లోని నిందితుల ఇళ్లల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. పశువుల పాకలు, గడ్డివామిదొడ్లు తదితర ప్రదేశాలను జల్లెడపట్టారు. రికార్డులు లేని ఐదు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నామ ని తెలిపారు. అనంతరం గ్రామంలోని ప్రధాన రహదారి, కాలనీలలో పోలీసులు కవాతు చేపట్టి మెచ్చిరి గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ఎన్నికల కౌంటింగ్ రోజున కానీ, ఆ తర్వాత కానీ గొడవలు, అల్లర్లకు దిగితే చట్టపరంగా కఠినశిక్షలు చట్టం పడేలా చేస్తుందని సీఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో బొమ్మనహాళ్, కణేకల్లు, ఎస్‌ఐలు, రాయదుర్గం రూరల్ సర్కిల్ పోలీసులు పాల్గొన్నారు.

కరెంట్ కోతలను నివారించాలి

తాడిపత్రిటౌన్, మే23: పట్టణంలో కరెంట్ కోతలను నివారించాలని సీపీఐ నాయకులు ట్రాన్స్‌కో ఏఈ ఉదయ్‌కుమార్‌కి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవియాదవ్ మాట్లాడుతూ ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం వల్ల విద్యుత్ లో ఓల్టేజీతో గృహాల్లోని ఏసీలు, ఫ్రిడ్జ్‌లు, కూలర్లు, టీవీలు, ఫ్యాన్లు తదితర సామగ్రి కాలిపోతున్నాయన్నారు. కరెంట్ లేని సమయంలో ప్రజలు ఫోన్లు చేస్తే స్పందించే నాథుడే లేడని ఆరోపించారు. రాత్రి సమయాల్లో కరెంట్ కోతతో పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వినతిపత్రం అందించిన వారిలో ఏఐటీయూసీ నాయకులు రమణ, శ్రీనివాస్‌యాదవ్, నాగేంద్ర, ఉమాగౌడ్, అబ్రహం, నాగరాజు ఉన్నారు.



ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఘనంగా మొలకల పౌర్ణమి

పుట్లూరు, మే23: మండలంలోని బాలాపురం గ్రామంలో గురువారం గ్రామస్థులు మొలకల పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మొలకలను మట్టికుండల్లో ఉంచి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మట్టికుండలను తలపై ఎత్తుకొని ఊరేగింపు చేశారు. గ్రామంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఇలా చేయడం వల్ల సకాలంలో వర్షాలు పడి పంటలు సమృద్ధిగా పండుతాయని గ్రామస్థుల విశ్వాసం.



మొలకలతో చిన్నారులు, మహిళలు (పుట్లూరు)



వెన్నపూసపల్లిలో మొలకలు తీసుకెళ్తున్న మహిళలు

యల్లనూరు, మే23: మండలంలో గురువారం మొలకల పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వెన్నపూసపల్లి, పాతపల్లి, లింగారెడ్డి పల్లి గ్రామాల్లో ఈ వేడుకలు జరిగాయి. వేడుకల్లో భాగంగా వారంరోజుల కిందట మట్టికుండల్లో నవధాన్యాలను ఉంచారు. గురువారం ఉదయం వాటిని బయటకు తీసి వాటిలో నుంచి వచ్చిన మొలకలను మహిళలు తలపై ఉంచుకొని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది పంటలు సమృద్ధిగా పండి గ్రామాలు కళకళలాడాలని వేడుకున్నారు.

శేషవాహనంపై శ్రీవారి దర్శనం



ఊరేగింపులో పాల్గొన్న కురిహినశెట్టి సంఘం సభ్యులు

రాయదుర్గం రూరల్, మే 23: పట్టణంలోని ప్రసన్న వేంకటరమణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు గురువారం శేషవాహనంపై దర్శనం ఇచ్చారు. స్వామి వారికి ఉదయాన్నే నైవేద్య సేవ, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, పుష్పలంకరణ, వస్త్రవులంకరణ తదితర పూజలు నిర్వహించారు. అనంతరం రథాన్ని అందంగా అలంకరించి స్వామివారి ప్రతిమను ప్రతిష్ఠించి దేవాలయం నుంచి మొలకాల్మూరు బస్టాండ్, వినాయకసర్కిల్, పాతబస్టాండ్ మీదుగా లక్ష్మీబజార్ ఎంపీడీఓ కార్యాలయం వరకు ఊరేగించారు. కార్యక్రమంలో కురిహినశెట్టి సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భార్య చేతితో భర్త హతం

గుంతకల్లు టౌన్, మే 23: పట్టణంలోని కొనకొండ్ల రోడ్డులోని రైల్వే గేట్ వద్ద నివాసముంటున్న బీ శ్రీనివాసులు(52)ను ఆయన భార్య సరస్వతి హత్య చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. శ్రీనివాసులు, సరస్వతీ దంపతులు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో తోపుడు బండ్ల మీద పండ్ల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నారు. శ్రీనివాసులు రోజు మద్యం సేవించి భార్యతో గొడవపడి ఆమెను చితకబాదేవాడు. ఈక్రమంలోనే బుధవారం రాత్రి కూడా శ్రీనివాసులు మద్యం సేవించి వచ్చి భార్య సరస్వతితో గొడవ పడ్డాడు. భరించలేని ఆమె కట్టెతీసుకొని శ్రీనివాసులు తల మీద కొట్టింది. అతను కిందపడగానే గొంతుమీద కాలుపెట్టి నులిమి హత్య చేసిందన్నారు. రూరల్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, ఎస్‌ఐ సురేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడుకి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

295 మంది రిజిస్ట్రేషన్

బెళుగుప్ప, మే 23: మండలంలో విత్తన వేరుశనగ కోసం 295 మంది ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు వ్యవసాయాధికారి పృథ్వీసాగర్ గురువారం తెలిపారు. 295 క్వింటాళ్ల విత్తనానికి డబ్బు చెల్లించి పేర్లు నమోదు చేయించుకున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాలలో విత్తన వేరుశనగ పంపిణీ చేస్తామన్నారు.

హింసకు పాల్పడితే కఠిన చర్యలు

బెళుగుప్ప, మే 23: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఫలితాలు వెలువడిన రోజు హింసాత్మక సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ శివ హెచ్చరించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి టీడీపీ, వైసీపీ నాయకులపై బైండోవరు కేసులు నమోదు చేశామన్నారు. 2017 నుండి ఇప్పటివరకు బైండోవర్ అయిన వారిపై రెండు కేసులుంటే రౌడీషీటర్‌గా కేసు నమోదు చేస్తామన్నారు. జూన్ 4న టపాసులు కాల్చడం నిషేధమన్నారు. టపాసులు విక్రయిస్తున్న వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు.

27 మంది బైండోవర్

పెద్దవడుగూరు, మే23: మండలంలోని 27మంది రౌడీ షీటర్లను గురువారం బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. కౌంటింగ్ సందర్భంగా అల్లర్లు జరగకుండా ముందు జాగ్రత్తగా రౌడీషీటర్లను తహసీల్దార్ వద్ద హాజరుపరిచి, బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు.

యల్లనూరులో 15 మంది..

యల్లనూరు: మండలంలో 15మందిని బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐ గిరిబాబు గురువారం తెలిపారు. శింగవరం, కొత్తపల్లి, కల్లూరు, కూచివారిపల్లి, యల్లనూరు గ్రామాలకు చెందిన వివిధ కేసుల్లో ఉన్నవారిని స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించినట్లు ఆయన తెలిపారు. అనంతరం తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-1 అనంతపురం వారు కె.ఉస్మాన్ సాబ్ కిం కె.దస్తగిరి సాబ్ (ప్లాట్‌నెం. 152,164,165,166) ఎమ్.వెంకటేశ్వరమ్మ D/o ఎమ్.బాలిరెడ్డి (ప్లాట్ నెం.163,230,237) అను పేరున గల ఆస్తి తాకట్టుపై శ్రీవిద్యా ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, D.No.6-934, ఆజాద్ నగర్ అనంతపురం వారికి ఋణం ఇవ్వదలచుకున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్నయెడల 7 రోజులలోపు నాకు గానీ నా క్లయింట్‌కు గానీ తెలుపగలరు.

షెడ్యూలు

అనంతపురం రి॥డి॥ అనంతపురం రూరల్ సబ్ రి॥డి॥కి చేరిన కూడేరు మండలం కమ్మూరు గ్రామ పంచాయితీ పరిధి లోని సర్వేనెం.536లో ప్లాట్ నెంబర్లు:163, 230, 237,152,164,165,166.
ప్లాట్‌నెం.163 చెక్కుబంది:-తూర్పు 30 అ॥లు రోడ్డు, పడమర: ప్లాట్ నెం.158, ఉత్తరం: ప్లాట్ నెం.164, దక్షిణం: ప్లాట్ నెం.162.
ప్లాట్‌నెం.230 చెక్కుబంది:-తూర్పు:30 అ॥లు రోడ్డు, పడమర: ప్లాట్ నెం.206, ఉత్తరం: ప్లాట్ నెం.231, దక్షిణం: ప్లాట్ నెం.229.
ప్లాట్‌నెం.237 చెక్కుబంది:-తూర్పు: ప్లాట్ నెం.290, పడమర: 30 అ॥లు రోడ్డు, ఉత్తరం: 30 అ॥లు రోడ్డు, దక్షిణం: ప్లాట్ నెం.238.
ప్లాట్‌నెం.152 చెక్కుబంది:-తూర్పు: ప్లాట్ నెం.169, పడమర: 30 అ॥లు రోడ్డు, ఉత్తరం:ప్లాట్ నెం.151, దక్షిణం: ప్లాట్ నెం.153.
ప్లాట్‌నెం.164 చెక్కుబంది:-తూర్పు: 30 అ॥లు రోడ్డు, పడమర: ప్లాట్ నెం. 157, ఉత్తరం:ప్లాట్‌నెం.165, దక్షిణం: ప్లాట్ నెం.163.
ప్లాట్‌నెం.165 చెక్కుబంది:-తూర్పు: 30 అ॥లు రోడ్డు, పడమర: ప్లాట్ నెం. 156, ఉత్తరం:ప్లాట్ నెం.166 దక్షిణం: ప్లాట్ నెం.164
ప్లాట్‌నెం.166 చెక్కుబంది:-తూర్పు: 30 అ॥లు రోడ్డు, పడమర: ప్లాట్ నెం. 155, ఉత్తరం:ప్లాట్ నెం.167 దక్షిణం: ప్లాట్ నెం.165

Y.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్,
ATP Cell:9440565907

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము
డి.ఆర్.ఏ.08/2024

మెస్సర్స్ శ్రీ రఘువరన్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, అనంతపురం బ్రాంచ్
-- డిస్‌ప్యూటెంట్
వర్సెస్
హెచ్.రమేష్ మరియు ఇతరులు
- అపోనెంట్స్

అపోనెంట్ 1 కినోటీసు

1.హెచ్. రమేష్ తండ్రి: హనుమంతరాయప్ప, వయస్సు: 30 సం॥లు. ఉద్యోగి: అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్, ఆఫీస్/ఆఫ్ అగ్రికల్చర్ జాయింట్ డైరెక్టర్ రెగ్యూలర్, బెళుగుప్ప, కళ్యాణదుర్గం మం॥, నివాసం:డో.నెం.7-60, యస్.సికాలనీ, ఇరిగే పల్లి గ్రామం, అగళి మం॥, శ్రీ సత్యసాయి జిల్లా.
డిస్‌ప్యూటెంట్, డిస్‌ప్యూట్ బాకీమొత్తం రూ. 1,47,785/-లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ప్యూట్‌లో 1కి అపోనెంట్ అయిన మీరు 05-06-2024 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.

By order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్‌చిట్స్ / ఆర్బిట్రేటర్, అనంతపురము
డి.ఆర్.ఏ.02/2024

మెస్సర్స్ శ్రీ రఘువరన్ చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, అనంతపురం బ్రాంచ్
-- డిస్‌ప్యూటెంట్
వర్సెస్
ఎ.ఒబిళేసు మరియు ఇతరులు
- అపోనెంట్స్

అపోనెంట్ 3 మరియు 4 కినోటీసు

3.యస్.ఖాదర్‌వలి తండ్రి: యస్.షేక్షావలి, వయస్సు: 51సం॥లు. ఉద్యోగి: స్కూల్ అసిస్టెంట్, జెడ్.పి.హైస్కూలు (సెంట్రల్) ఉరవకొండ, నివాసం: డో.నెం.18-872, తిలక్ నగర్, గుంతకల్లు, అనంతపురం జిల్లా.
4. ఎ.రామచంద్రారెడ్డి తండ్రి:ఎ.నరసిఖ రెడ్డి వయస్సు:43 సం॥లు నివాసం:గొల్లపల్లి గ్రామం, రాప్తాడు మండలం॥, శ్రీ సత్యసాయి జిల్లా.
డిస్‌ప్యూటెంట్, డిస్‌ప్యూట్ బాకీమొత్తం రూ. 1,65,627/-లు రాబట్టుకొనుటకు గానూ మీపై దాఖలుచేసిన డిస్‌ప్యూట్‌లో 3 మరియు 4కి అపోనెంట్ అయిన మీరు 05-06-2024 తేదీన హాజరు అగుటకు గానూ వాయిదా వున్నది. పైదినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ O/o ది జిల్లా రిజిస్ట్రార్, డోర్.నెం. 6-3-134, 1వ అంతస్తు, రామ్‌నగర్, అనంతపురము వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోనంతట డిస్‌ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.

By order of Deputy Registrar of Chits O/of the District Registrar, Registration and Stamps Dept., D.No. 6-3-134, 1st Floor, Ram Nagar, Ananthapuramu

ప్రకటన

కొలిమి మైనుద్దీన్ S/o K.అన్వర్ D.No.2-151, కాగితాల వీధి, పామిడి పట్టణం, పామిడి మండలం వారికి సంబంధించిన పామిడి గ్రామ పంచాయతీ ఏరియాలో నారాయణవీధిలో సర్వేనెం.993-Aలో 53.33 గజాలలో D.No. 11/171B గల ఇంటిని గుంతకల్లు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు తాకట్టు పెట్టడం జరుగుతున్నది. ఈ ఆస్తి పైన ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న యెడల గుంతకల్లు శ్రీరామ్ చిట్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించగలరు.
హద్దులు :- తూర్పు: పంచాయతీ రాములు, పడమర: రస్తా, ఉత్తరం: రస్తా, దక్షిణము: చాకలి నాగేంద్రమ్మ ఇల్లు.

M.G. భాస్కర్‌గౌడ్
అడ్వకేట్, గుంతకల్లు